
ఉన్నవోదయ ప్రవక్త

# ఒంటరి గొంతు



జోలది భీమన్న

ఆత్మీయులు, యువ కవితా కౌముదీశులు
ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖా మంత్రి వర్యులు
మాన్యశ్రీ **పోడపాటి చంద్రశేఖర్ గారికి**

కోకిలకు చెప్పు కొంటున్నా
ఆత్మాశ్రయ కావ్యం ఈ ఒంటరిగొంతు
కోకిలను ప్రవక్త అన్నాను.
ఉన్నవోదయ ప్రవక్త అనీ అన్నాను.

కావ్యం ఏదో ఒక ప్రాపును
ఆశ్రయించుకొని పైకి ప్రాకే
లలిత మంజుల మనోజ్ఞ లతిక కదా !

కావ్యం ఉన్నవోదయ ప్రవక్త అయితే
దానికి ఆశ్రయమయ్యే స్వీకర్త
అంతటి తేజస్వి కావాలి !

కాక, ఘూక, భేక ఖీంకారాలను
అదుపుచేసి ఆహ్లాదపరచే
ప్రకృతి ధర్మ వేదికపై
శుక పిక శారీ మయూరీ
బృంద నాట్య గాన విన్యాసాలతో
క్షణ క్షణే సాధించబడుతున్న ప్రగతి అంతా
ఈ కోకిల తెస్తున్నదే, మన కిస్తున్నదే !

ఇంతటి కావ్య భారతికి
అంతటి ధీరోదాత్త స్వీకర్త
ఎక్కడ ఎలా లభిస్తాడు,
సులభంగానే లభించాడు
శుభోదయ సుప్రభాత రవిచంద్రుడిలో

రవి చంద్రనేత్రుడు
చంద్రశేఖరుడే కదా !
యువకవి చంద్రశేఖరుడుగా
సాక్షాత్కరించాడు నా ఎదుట
అందుకే నా అన్వేషణ
సులభంగానే ఫలించింది
మంత్రి చంద్రశేఖర్ గారి ఆమోదంతో
సినారె పాటలోని పగలే వెన్నెల
నన్ను ఆనందంలో ముంచెత్తగా
జగమే ఊయలగా
ఊగగా నా క్షణం
ఈ చంద్రశేఖరుడు ప్రస్తుతం
ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మంత్రి
ఆధునిక యువకవులలో
అమృత రస నిక్షేపం
సహృదయుడు, సకల కళా విద్యాధరుడు
మాకు ఆత్మీయుడు, అందరికీ ఆత్మ బంధువు

అట్టి మహితాత్ముడికి
ఇట్టి నవకావ్యాన్ని
సమర్పించగలుగుతున్నానంటే
నేనెంత అదృష్టవంతుణ్నో
వేరే చెప్పాలా !

ఇతోధిక ప్రాభవ దీప్తి దాయకంగా
ఈ కావ్యాన్ని సమర్పిస్తున్నాను
చిరునవ్వుతో అందుకొంటున్నందుకు
ఆయనకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

– భీమన్న.

# ప్రత్యూషం

ఓ.... ఓ..., కో.... ఓ.., కో..... ఓ....

అంటూ ఎవరో పిలుస్తున్నట్లు వినిపించి, కళ్లు తెరిచి చూశాను. తెల్లవారుఝామున నాలుగున్నర గంటలు.

అలాగే పైకి చూస్తూ పడుకున్నాను. లేవబోతున్నాను, లేవలేదు. అది వృష నామ సంవత్సరాది. ఉగాది. ఈ సత్యాన్ని ప్రకటిస్తున్నది ఒక కోకిల - బహుశా తూర్పుదిశలోని మా మామిడి చెట్టు నుంచి.

ఒక గంట సేపు అలాగే పడుకుని వున్నాను - దానికూత వింటూ మా ఆవిడ ఇక లే అంటూ లేవదీసే వరకూ.

ఉగాది, ఉగాది పచ్చడి, మిత్రులు, కబుర్లు మామూలే అయినా ఆ కోకిల గొంతు వినిపిస్తూనే వుంది.

మా దొడ్లో ఒక చిన్న కొండ. దానిని ఆనుకుని నేను పెంచిన ఒక పెద్ద రావి చెట్టు. దానికి ఆసరాగా నేనే నాటిన ఒక చిన్న వేపచెట్టు. ఆ పక్క ఒక మామిడి చెట్టు. కొన్ని కొబ్బరి చెట్లు. మా విజ్జు మెదక్ నించి తెచ్చి పాతిన అగ్నిపూల చెట్లు, అరటి చెట్లు, చెంబేలి పొద, బొప్పాయి చెట్లు, మల్లె చెట్లు వగైరాతో అదంతా ఒకచిన్న అడవిలా వుంటుంది. ఆ చెట్ల మీద నుంచి కొన్ని కోకిలలు ఋతు జ్ఞానం లేకుండా ఉదయం మొదలు సాయంత్రం వరకూ పలకరించుకుంటూనే వుంటై. పిలుస్తూ, పలకరిస్తూ, తర్కించుకుంటూ, వెక్కిరించుకుంటూ, వాదాలతో, వివాదాలతో సందడి చేస్తూనే వుంటై.

అయితే, ఈ సారి అలాంటి సందడేమీ లేదు. ఒకే ఒక్క కోకిల ఉగాదికి స్వాగతం పలుకసాగింది. ఒకొక్కసారి ఒకొక్క చెట్టు మీద నుంచి స్వాగతం పలుకుతున్నది. స్వాగతం పలుకుతున్నదని నే ననుకోవడమే తప్పు అది ఎందుకలా అరుస్తున్నదో, దానికి మరో కోకిల ఎందుకు ప్రతి పలకడం లేదో వాస్తవం తెలియదు కదా!

కోకిల వసంత ఋతువుతో వస్తుందనీ, వర్ష ఋతువుతో వెళ్ళిపోతుందనీ కవి సమయం. అది నిజం కాదని అందరికీ తెలుసు. అయినా, చాల కవి సమయాలవలెనే ఇది కూడా ఒక లోక వాస్తవం అయింది.

ఏది ఏమైనా, లోకానుభవానికి నా అనుభవానికి ఈ సారి విపరీతంగా ఘర్షణ జరుగుతూ వుంది. ఉగాది నుంచి చూస్తున్నాను, వింటున్నాను. అదొక్కటే కూస్తూ వుంది. మరో గొంతు వినిపించటం లేదు. దాని కూ... ఊ..కి అలవాటుగా నేనూ కూ.. ఊ అని పలకబోయాను. వయస్సు ముదిరినా మనస్సు పచ్చిగానే వుంది. కోకిలకు ప్రతి పలకాలనే తప్ప, పలికే వయస్సు దాటి పోయిందన్న జ్ఞానమే లేదు.

అప్పుడనిపించింది నాకు - ఈ కోకిల ఎవరో ఒంటరిగా అరుస్తున్న దని, దాని గొంతు కూడా నా గొంతు లాగే ఒంటరిగా స్పందిస్తున్నదని, ఇదంతా నాకేదో విశేషం చెప్పడానికో, జ్ఞాపకం చెయ్యడానికో ఇలా జరుగుతున్నదనీ!

నేను పుట్టినప్పటి నుంచీ కోకిల నా సహచరి. దానిలో ఇలాంటి ఒంటరి తనం నే నెప్పుడూ చూడలేదు. వెంటనే నాకు ప్రవక్తలు జ్ఞాపకం వచ్చారు. నా జీవిత ఘట్టాలు ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి. ఒక సమగ్ర కావ్యానికి అంకురార్పణ జరిగింది. కోకిల ఒంటరి గానే అరుస్తూ వుంది. నేను నా కావ్యాన్ని పలుకుతూనే వున్నాను.

అటు ఎక్కడో కోకిల, ఇటు ఇక్కడ నేను... ఈ ఉభయ సంధ్యల మధ్య నడుస్తున్న నిరంతర జీవన వాహినీ తరంగాలే ఈ కవితలు, ఈ కవితా బృందగానం, గాన స్రవంతి, కావ్య వాసంతి.

# ఒంటరి గొంతు

## వసంత కోకిల

సూర్య నమస్కారాలు చెయ్యడానికి
సూర్యుడి అనుమతి కావాలా ?
నదీ జలాన్ని పొలానికి మళ్ళించడానికి
నది అంగీకారాన్ని పొందాలా ?
అక్కర లేదు కదూ !

కోకిలా.........
నే నంటే కిట్టని
పొరుగు వారి తోటలో నుంచి
వస్తున్న నీ మధుర గానాన్ని
సదరు పొరుగు వాడు నిరోధించగలడా ?
ప్రయత్నించవచ్చు !
సాధ్యం మాత్రం కాదు !

రోజా మొగ్గ వికసించింది
అది దాని స్వభావం
దాని చుట్టూ తుమ్మెద తిరుగుతున్నది
దానిని తుంచి జడలో పెట్టుకొన్నదొక పిల్ల

అందని చంద్రుడు
అద్దంలో తనను పట్టుకోవద్దని
శాసించగలడా ?
అందని వారి ఔన్నత్యాలు అలాంటివి
ఆకాంక్షల కైమోడ్పులు ఇలాంటివి
కోకిలా ! ఈ పోలికలు నీవీ, నావీ !

పుట్టినప్పటినుంచీ నీ గానాన్ని వింటున్నాను,
నీ అనురాగాన్ని ఆస్వాదిస్తున్నాను.
అందుకు నీ అనుమతి ఏదీ అక్కర లేదు!

నీవు నీరవ నిగూఢ రసాలినీ కిసాలయాలలో
సమున్నత స్థాయిలో విహరించే విశ్వ గాయనివి!
నాకు అందవు, నేను అందుకోలేను!
విశ్వ మానవ పరిధులు
విశాల తరాలు, విషమ గమనాలు!

అయితే, కోకిలా....
నా గొంతు లాగే నీ గొంతు కూడా
ఒంటరి దెందు కయింది?

ఉగాది ఉదయం నుంచీ చూస్తున్నాను
చూస్తున్నా నంటే వింటున్నాను
వింటూ ఆలోచిస్తున్నాను
ఆలోచిస్తూ ఊహిస్తున్నాను
ఊహాతీతంగా ఏమిటీ ఒంటరి గొంతు?

## 2. గుంపు లేమయ్యారు!

నేను పుట్టి బుద్ధెరిగి నప్పటి నుంచీ
ఏనాడూ ఒంటరిగా లేను.
నా ఈడు కుర్రాళ్ళను వెంటబెట్టుకొని
తోటంతా తిరిగేవాణ్ణి.

ఒక్క మా తోటే కాదు,
మా వూళ్ళోని తోటలన్నీను!
మా చేతుల్లో బాణా కర్ర లుండేవి
కంకర రాళ్ళుండేవి.

మామిడి కాయలూ, ఉసిరి కాయలూ
వెలక్కాయలూ, జామకాయలూ వంటివి మాత్రమే కాక
కొబ్బరి కాయలు కూడా రాళ్లతో పడగొట్టే వాణ్ని
మోచేతితో కుమ్మి పెళ్ళు వలిచే వాణ్ని.

నా గొంతు ఎప్పుడూ ఒంటరిది కాదు.
నేను కో అంటే కోటి మంది చుట్టూ చేరేవాళ్లు.
అప్పుడు నీవూ అంతేగా!
నీ చుట్టూ కోకిలలు గుంపులుగా వుండేవి.
ఇప్పుడేదీ ఆ శోభ?

## ౩. మరకత శ్యామ

చాలా కాలం వరకూ నీ స్వరం వినడమే గానీ
నీ ఆకారం నే నెప్పుడూ చూడలేదు.

ఒక రోజున మా బొప్పాయి చెట్టు మీద
పళ్లు తింటున్న మీ జంటను చూశాను.
ఎంత అందమైన జంట!
నీ వెలానూ మరకత శ్యామవే
నీ జంట నవరత్నాల కుప్ప!

వెండి బంగారు తీగలకు నవరత్నాలు గుప్పినట్లు
ఎంత సుందరమైంది పుంస్కోకిలం!
కవులు చెప్పితే వినడమే తప్ప
నే నెప్పుడూ ఏత ద్గానం వినలేదు.
విన్నానేమో జ్ఞాపకం లేదు.
శుక పిక శారికలలో
నీవు మాత్రమే చేతికి చిక్కేదానివి కాదు
గోరింక పిల్లలను, చిలకలను పెంచే వాణ్ని
మిడతలను కొట్టి మేపే వాణ్ని

రకరకాల పళ్ళు తినిపించేవాణ్ని.
శ్రీ కృష్ణుడి మురళి
నీవుగా వచ్చి పిలిచేదో, ఏమో !
ఆ రోజులు ఎంత మనోజ్ఞంగా వుండేవి !

## 4. నవోదయ సభలు

"కోకిలా నీ గానమేదో
కూర్పరాదా సంపుటమ్ముల
ప్రణయ రాగ రహస్యమేదో పట్టుకొందునుగా"
అనే పాట రాసింది నేను ఆ రోజులలోనే !

మత్తకోకిల ఛందస్సునే
మాత్రలలో చెపుతున్నా ననుకోలే దప్పుడు !
ఇప్పుడు గుర్తించాను,
నా గేయాలు చాలావరకూ
మత్తకోకిళ్లే అని !
అకాండ తాండవం మొత్తం
మత్తకోకిళ్ల సమావేశమే కదా !

వసంతోదయానికి స్వాగతం పలికే వాళ్లలో
ఎవరిది ప్రథమ స్థానం ?
కాకి, కోకిల, గోరింక, చిలుక, ఈల పిట్ట
గువ్వ, పిచ్చుక, తుమ్మెద
అదొక వసంతోత్సవ సభ !
ఎవరి ప్రత్యేకతలు వారు చెప్పుకొనే వాదాలు !

ఈ కవిత లన్నీ నేను పాడుకొంటూ తిరిగేవాణ్ని
ఆనాటి నా పరిసరాల లాగే నా కవితలు

ఉద్యాన వనాలే కాదు,
కీకారణ్యాలు కూడా!
నిన్ను అనుకరించడంతోనూ, వెక్కిరించడంతోనూ
గడిచి పోయా యా రోజులు!

## 5. కాకిది తప్పా ?

నీకు జ్ఞాపకం వుండే వుంటుంది, కోకిలా!
తోటలోని నా పర్ణ కుటీరం ప్రాంగణంలో
చెట్టు మీద నుంచి ఒక పసికూనను
క్రిందికి తోసేసి, రెండు కాకులు దాని మీద వాలి
పొడిచి చంపడానికి ప్రయత్నించాయి.

అదంతా ఏమిటో నా కర్థం కాలేదు.
జరుగుతున్నది హింసే కనుక
నేను కాకుల్ని తరిమేసి, పసికూనను
కోళ్ల గంప క్రిందకు చేర్చాను.

అప్పుడొచ్చావు నీవు,
అప్పుడు చూశాను నిన్ను దగ్గరగా,
అది నీ కూన!
కోకిల కూన!

హింసకు పాల్పడ్డాయని కాకుల్ని నిందిస్తున్న నాకు
నీ మీద కోపం వచ్చింది!
కాకి గుడ్డును తోసేసి
దాని స్థానంలో నీ గుడ్డును పెట్టావు కదూ!
నీ మోసం తెలుసుకొన్న కాకులు
ప్రతీకారానికి పాల్పడితే తప్పా?

ప్రతీకారం ఏ రూపంలో ఎక్కడున్నా తప్పే !
జీవిత యాత్రలో కొట్లాడుకుంటూ
ముందుకు పోవడం ఆనందకరమా ?
అదే అభ్యుదయకర మంటున్నారు శాస్త్రజ్ఞులు
ప్రతీకార చర్యకు ఘర్షణ అనే పేరు పెట్టి !
చర్యకు ప్రతిచర్య సహజమైతే
సృష్టిలో అసహజ మైనదేదీ లేదు !

కోళ్ల గంపను చేరి, చుట్టూ తిరుగుతూ
ఏడ్చావు నువ్వు,
శిలువ మీద ఏసును చూస్తూ మేరీ ఏడ్చిన ఏడ్పు !

కోళ్ల గంపను తీసేసి
నీ పిల్లను నీ కప్పగించేశా నప్పుడు !
నాకు జ్ఞాపకం వుంది.
నీకూ వుండే వుంటుంది !

## 6. కామందు - కాకులు

నీ పిల్లలను, కోకిలా,
పరభృతాలుగా ఎందుకు చేశావు ?
నీవు చేశావా ? ప్రకృతి చేసిందా ?
నీకు గూడు లేదు,
కట్టుకోవడం చేత కాదు,
గుడ్లు పెడతావు కానీ,
పొదగడం అసలే చేతకాదు !

నీ కున్న దొక్కటే, మధుర స్వరం !
నీ పంచమ స్వరం లేకపోతే
అసలు సంగీతమే లే దనవచ్చు !

అదీ నీ అహంకార కారణం!
నీ ఉన్నత స్థాయి హేతువు!

ఒక్క సుగుణాన్ని పురస్కరించుకొని
మొత్తం జీవిత బాధ్యతలను పరాక్రాంతం చేసి
తేరగా బ్రతకడం ఎంత కాలం?
ఎంత కాల మేమిటి?
ఎంత కాలమైనా సాగుతుంది,
ఎంతో కాలంగా సాగుతున్నది!

మనిద్దరి జీవిత పరిస్థితీ ఒక్కటే!
నేను కామందుల పొలంలో గుడెసె వేసుకొని
వాళ్లు పెట్టేది తింటూ
వాళ్లకు సేవ చేస్తూ బ్రతికాను,
నాకు కామందులు, నీకు కాకులు!

## 7. ఎడమ చెయ్యి వేర్పాటు

మనిషి లోని ప్రతి అవయవమూ
రెండేసి ఎందు కుంటున్నై?
అందం కోసమూ, ఆసరా కోసమూ,
ఆకార సౌష్ఠవం కోసమూ!
అవునా? అవును కదా!

మరి, కుడి చేతి పట్ల
ఎడమ చేతి కెందుకీ అసూయ?
సహాయ పడుతూనే ఏడుస్తుం దెందుకు
మంచి పనులన్నీ
కుడి చేతికే చెప్తారనుకొంటూ!

రచయితకు వచ్చే మమూలు వణుకే
నాకూ వచ్చింది కుడి చేతికి!

ఇప్పుడు, కుడి చెయ్యిని మించి
ఎడమ చెయ్యి వణుకుతోంది!
కుడి చెయ్యి పడకేస్తే
దాని పనులు కూడా
చెయ్యవలసిన ఎడమచెయ్యి
తాను కూడా పడకేయ వచ్చునా?
ఇది బాధ్యతా రాహిత్యం కాదా!

ఇది సానుభూతి లక్షణ మంటున్నారు వైద్యులు!
సానుభూతి ఇలా వుండదు, వుండకూడదు,
చచ్చేవాడ్ని బ్రతికించడం సానుభూతి,
తాను కూడా చావడం అపకృతి, అవజ్ఞత!
తాతాచార్యుల వారి బిళ్ల గోచీ
మార్గదర్శకత్వం ఇదే నేమో!

## 8. రచనా పచనం

నిన్ను గురించి పాటలూ, పద్యాలూ
చిన్న చిన్న కావ్యాలూ, నృత్య నాటికలూ
ఎన్నో వ్రాశాను,
మనిద్దరి గురించీ ఒక కావ్యమే
రాయాలనుకున్నా నిప్పుడు.
చేతులు వణుకుతున్నై,
ఎలా వ్రాయను?
మా విజ్జును కాస్త వ్రాసి పెట్టమన్నాను.
సరే అని, ఒక నెల సెలవు పెట్టి వచ్చింది.

ఆఫీసరు సెలవు పెట్టడ మంటే
ఏమిటో తెలుసా?

సగం రోజులు పెండింగ్ ఫైళ్లు
పరిష్కరించు కోవడంతో పోతై.
తక్కిన రోజులు పోస్టింగు కోసం
ప్రయత్నించడంతో గడుస్తై.

అయితే, మధ్య మధ్య
నా పని కూడా చేసి పెట్టిం దనుకో
లేకపోతే,
ఈ కావ్యం ఎలా తయారైంది ?

## 9. ఊహ తెలిసిన లేఖిని

కావ్యం అంటే జీవితం
నాయికా నాయకులు, భావానుభావాలు
రసాదులు, అనుచర సహచర వర్గం
అంతా ఒక నిండు జీవితం !

వాక్యం రసాత్మకం కావ్యం
అనే నిర్వచనం నిజమేనా ?
ఒక్క వాక్యం రసాత్మకం అయినంత మాత్రం చేత
కావ్యం కాదు నా దృష్టిలో !
ఒక కప్పుడు మధువు, ఒక గ్లాసుడు పాలు
లడ్డు, జిలేబి, పచ్చడి, పాయసం
ఎన్ని కలిపినా ఒక పూర్తి భోజనం కాదు !

కావ్యం విందు భోజనం,
చిన్న చిన్న కవితలు చిరు తిళ్లు !

కోకిల గురించి రాయని కవి లేడు !
ఆరుహ్యా కవితా శాఖాం
వందే వాల్మీకి కోకిలం అంటూ

వాల్మీకి నే కోకిలం అన్నారు.
కవికోకిల అనే బిరుదు లేని కవులే లేరు!
అయితే, ఆ కవిత లన్నీ
శ్రీనాథుడన్నట్లు
చిన్న చిన్న గుళ్ల చిల్లర దేవుళ్లు!

నే నిప్పుడు నీవు ఇతివృత్తంగా
ఒక కావ్యమే వ్రాస్తున్నాను
వ్రాయడం కాదు, చెపుతున్నాను.
ఊహ తెలిసిన, మన సెరిగిన
ఒక లేఖకురాలికి చెపుతున్నాను
ఊహ తెలియంగల లేఖక పాఠకోత్తములు
దొరికి నప్పుడే మహా కావ్యాలు
వ్రాయగలమన్నాడు పెద్దన!

లేఖక పాఠకోత్తముల మాట ఎలా వున్నా
కావ్యం వ్రాయాలంటే
అందులోని పాత్రల గురించి క్షుణ్ణంగా తెలియాలి
జీవితాలలోని రహస్యాలన్నీ తెలియాలి.

నీ గురించి వ్రాయడ మంటే
నీ జీవిత మంతా తెలియాలి కదా!
ఇప్పుడు చెప్పు - నీవు
ఒంటరి దాని వెలా అయ్యావు?

## 10. లలితా లాలిత్యం

సహజమైన కవి ప్రతివాడూ కవికోకిలే!
కవికి ప్రతిభతో పాటు పాండిత్యం వుండవచ్చు
ప్రధానమైంది ధర్మ జ్ఞానమూ, లోక జ్ఞానమూ!
అన్నిటికీ మూలం బ్రహ్మ జ్ఞానమే!

పండిత కవులు కవులు కారు
ప్రచార కవులు కవులు కారు
ఉద్యమ కవులు కవులు కారు
వాళ్లు కవుల కంటే గొప్పవాళ్లు !

కోకిల కంటే గరుడ పక్షి గొప్పది !
మల్లెతీగ కంటే మర్రిచెట్టు గొప్పది !
అందుకే ...
మల్లెమొగ్గలనూ, మధుప్రియలనూ
మధువునూ ప్రేమించే నేను
చక్రవర్తుల పట్ల భయ భక్తులనే తప్ప
చనువునూ, సరదానూ అనుభవించ లేను !

## 11. పోలికలు

ఓంకారం నీ నాదం
ఎక్కడ నుంచి వస్తున్నది ?

ఓంకారం బ్రహ్మ స్వరూపం అన్నారు,
నీ గానం కూడా అదే కావచ్చు !
మరి నీవెవరి స్వరూపం ?

ఉదయ మధ్యాహ్న సాయాహ్నలు
త్రిమూర్తుల రూపాలైతే
నీవు చీకటి రాత్రివి కావచ్చు !
రాముడు, కృష్ణుడు, వ్యాసుడు లాగే
పరమాత్మ స్వరూపం కావచ్చు !
అదే నీ పట్ల నా ఆరాధన !

తాత్విక మతాలలో
శుద్ధాద్వైతం పేరు వినే వుంటావు కదూ !

వల్లభాచార్యుల మధురభక్తి అది !
దీని వంటిదే సూఫీ మతం కూడా !

ఆత్మ పరమాత్మలకు
ప్రేయసీ ప్రియుల సంబంధం కల్పించబడింది.
దానికీ, నా రసాద్వైతానికీ కొంచెం తేడా వుందనుకో !
సంబంధం అదే అయినా,
నేను ఆత్మనే అయినా,
ఖచ్చితంగా నేను ప్రియుణ్ణి !
పరమాత్మ నా ప్రియురాలు !
పోలికలు నాకు కిట్టవు గాని
పోలికలు లేకుండా మానవ జీవితం సాగదు మరి !

## 12. పురుషాహంకారం

నేను పురుషుడిగా పుట్టాను కనుక
పురుషాహంకారం నన్ను వదలదు !
పరమాత్మ ముందు కూడా
నేను స్త్రీ ననుకోలేను !
స్త్రీవలే ప్రవర్తించ లేను !

పుంస్త్వంలో సుందర గంభీరత వుంది,
మధుర లాలిత్యం స్త్రీ దే కదా !
అందుకే మధుర భక్తి, సూఫీ ప్రేమ
నాకు సరిపడవు !
నేను పురుషుణ్ణి,
నిన్ను స్త్రీ మూర్తిగానే ఆరాధిస్తాను !

ఇంతకూ నీ గానం
ఎక్కడ నుంచి వస్తున్నట్టు ?
నా చుట్టూ, నాలోన అంతటా

నీ గానమే వినిపిస్తున్నది!
నిన్ను వెతకడం
పరమాత్మను వెతకడమే!
నేను నేనే!
నేను కానిదంతా నాదే!
నా లోపల నన్ను నేను వెతుక్కోలేక
బైట వెతుకుతున్నాను నీ కోసం!

## 13. భ్రమణనాదం

ఎక్కడున్నావు నీవు?
చిత్రకూటంలోనా! చికాగోలోనా?
మాస్కోలోనా? మడగాస్కర్ లోనా?

బ్రహ్మకు నాలుగు ముఖాలు!
నాలుగు వేదాలకూ అవి ప్రతీకలు!
సంగీతం, సాహిత్యం, విజ్ఞానం, లోకజ్ఞత
నాలుగూ కలిసిందే కదా జీవితం!

జీవితాభ్యుదయ జ్యోతి సరస్వతి,
అది నీవే!
నీవు పాడుతూనే వుంటావు,
అది నీ స్వభావం!
నేను నీ వెంటబడి వింటూనే వుంటాను,
అది నా స్వభావం!
స్వభావం మారదు,
వికసిస్తుంది అంతే!
భూభ్రమణం స్వభావం!
భ్రమణ వేగ నాదం ప్రణవం!
ఆ ప్రణవమే ప్రణయం కావడం దాని స్వభావం!

## 14. జన్యు వ్యక్తిత్వం

నా కళ్ల ముందు పుట్టి పెరిగిన
తొంభై మంది ప్రవక్తలు నీవు
నవోదయ ప్రవక్తవు,
నిత్య నూతన ఉన్నవోదయ ప్రవక్తవు !
నాపై నీ ప్రవక్తృత్వం కనిపిస్తూనే వున్నది !

నేను ఎడ్లబండి తోలాను
సైకిలు తొక్కాను
బస్సెక్కాను, రైలెక్కాను
కారులో తిరిగి ఎన్నికల ప్రచారం చేశాను.
కాశ్మీరు వరకూ విమానంలో వెళ్లాను
ఇదంతా నీ ఉన్నవోదయ ప్రవక్తృత్వమే !
జ్ఞానమను, విజ్ఞానమను, సైన్సు అను
క్షణ క్షణాభివృద్ధి ప్రకృతి నైజం !
దానిని నీవు తెస్తున్నావు
నా కిస్తున్నావు
లోకానికి పంచిపెడుతున్నావు !

జన్యువు జీవనది
లోకము ఉపనది
వీటి సంయోగమే నేను అనేది
దాని ఎదుగుదలే వ్యక్తిత్వం
అన్నాడు అధునిక విజ్ఞాని అట్లూరి వెంకటేశ్వరరావు
ప్రకృతి పురుష సంయోగ నైరంతర్యం సృష్టి అన్నాను నేను.
యవ్వనమే జీవితం
నీవే జీవితం !
జీవిత మంటే యవ్వనమే !
అంతకు ముందుంది మొగ్గ,
ఆ తర్వాతది పండు !

జీవిత మంటే నీవే,
కాకులూ, గుడ్లగూబలూ !
ప్రకృతి శక్తి ద్వయంలో
నీవు పాజిటివ్, అవి నెగిటివ్!
పాజిటివ్, నెగెటివ్ లేకుండా
ప్రోగ్రెస్సే లేదు కదా !

## 15. హంపీ నిర్వేదం

'' ఈ కొమ్మపై నుంచి నీవు కోకో యంచు
ఆ కొమ్మపై నుంచి ఆమె కోకో యంచు
ఏమి బాసలు చేతురే, కోకిలా
ఏమి బాసలు చేతురే ?''
అన్నాడు బసవరాజు అప్పారావు.
రాయప్రోలు సుబ్బారావైతే
పొదల పొంత చేరి
నిన్ను పిలుస్తూ కూర్చునేవాడు.

''పాడు చున్నది రిచ్చవడి కోకిలాంగన
అష్ట దిగ్గజము లేమైరి, రారు ?''
అంటూ విచారించాడు కొడాలి వెంకటసుబ్బారావు
తన ''హంపీ క్షేత్రం'' లో !
నిజానికి, కోకిలా,
మన జాతి చరిత్రలో
సుందర సంస్కృతీ చైతన్యం అంతా
హంపీ క్షేత్రమే అవుతూ వచ్చింది కదూ !
సాటిలేని సాంస్కృతిక వైభవ మంతా
స్మశానమై పోతూ వచ్చింది !

కారణా లేమైనా
కల్యాణ వీరణాలు మృత్యు మృదంగా లవుతూ వచ్చాయి !
అష్ట దిగ్గజాలు ఏమైపోయారంటూ
దుఃఖిస్తూ వుంది హంపి !

## ఉపజ్ఞా కోకిల

కృష్ణా పత్రికలోని నా 'ఉపజ్ఞా కోకిల' కవితను
నాకు బిరుదు గానే ఇచ్చాడు జరుక్ శాస్త్రి.

కావ్య కుసుమాలు, దీపసభ, రాగోదయం,
మధుబాల, మధు గీత వంటి
ఆనాటి నా రచన లన్నీ
రకరకాల రూపాలలో నిన్ను వర్ణించేవే కదా !
నా పాత రచన దేనిని విప్పి చదివినా
నీవే పలుకుతావు,
నీవే కులుకుతావు !

నా కవిత వెలుగైతే, నీవు దాని నీడవు !
లోకంలోని ఇతర చోట్ల కూడా
నైటింగేల్ వంటి నామాంతరాలతో
నీవు ఆరాధించ బడుతూనే వున్నావు కదా !
ఓడ్ టు ఏ నైటింగేల్ అంటూ
ఆంగ్ల కవి మిత్రుడు ఎంత బాగా వర్ణించాడు నిన్ను !

చిలకలు, గోరింకలు వున్నాయంటే
అవి ఘనాపాఠీలు మాత్రమే !
చెప్పింది చెప్పినట్లు నేర్చుకొని
అదే మళ్లీ మళ్లీ చెపుతూ వుంటై.

## 17. ఉగ్రవాదం

చల్లగా, శాంతంగా వుండవలసిన వైశాఖి
ఉగ్రంగా వాదిస్తూ నిప్పులు చెరుగుతున్నది
ఇంతకంటే ఉగ్రవాదం ఏముంది ?
నీ స్వరంలో మార్పు కనిపిస్తున్నా,
వసంతాంతంలో కూడా
ప్రశాంతంగానే పాడుకొంటున్నావు !

నాకు మాత్రం ఒళ్ళు మండిపోతుంది.
తల చిట్లి పోతుంది.
ఉడికొలోన్ తో ఉగ్రవాదం చల్లారుతుందా ?
వట్టివేళ్ళ తడకలలో
ఎంత కాలం తలదాచుకుంటాం ?

మరి, చేసే దేముంది ?
వైశాఖపు ఎండలకు
ఫ్రిజ్జులో భద్రపరచుకొన్న
కొబ్బరి బొండాల నీళ్ళే మందు !
లేత ముంజెలు కూడా !
సందకల్లు సంగతి ఇప్పుడెందుకులే !
వైశాఖాన్ని గ్రీష్మంలో చేర్చి
మధువనీ విన్యాసాలకు
దూరంగా వుంచడం మంచి దేమో !

## 18. మారని సంప్రదాయం

నీ మధుమాస ప్రభాత భేరి
చైత్రోదయంతో ప్రారంభమైనా
వాస్తవ వసంతోదయం

ఫాల్గుణోదయం నుంచే కదా!
నీ స్వాగత వచనాలు కూడా!
ఫాల్గుణోదయంలోనే ప్రారంభమవుతై!

లోకులు గుర్తించ లేదు!
నేనూ లోకుల్లో ఒకణ్నే కనుక
వింటూ కూడా విననట్టే వుండిపోయాను!
సంవత్సరాది, ఉగాది, వసంతోదయం
నిజానికి ఫాల్గుణారంభం తోడిపే!

కరడు గట్టిన సంప్రదాయం
మార్పును గుర్తించనీయదు!

కాలం ఉన్నవోన్నవంగా మారుతున్నప్పుడు
తదనుగుణంగా సంప్రదాయం కూడా మారాలి కదా!
ఒక్క క్షణం మార్పులో
వేల సంప్రదాయాలు మారాలి!
ఒక్క క్షణం నిప్పులో
లక్షల లంకా దహనాలు జరగాలి!

మానవుడు మహా మహితుడు కాకపోవడానికి
మార్పును సహించని గతమే హేతువు!
హేతువును తొలగించ గలది
నీ ధాతువు ఒక్కటే!

## 19. లోకులు కాకులు

లోకులు కాకులు!
కాకులు నిన్ను నిషేధించినా
నీ స్వరాన్ని నిషేధించలేవు కదా!

తమ మ్రి చెట్టు మీదికి
నిన్ను రానివ్వక పోవచ్చు
ఒక్క మామిడి చెట్టుకే
నిన్ను పరిమితం చేసి
పరుల కంట పడకుండా
పరదాలు బిగించవచ్చు.
అయినా....
నీవు కుహూ అంటే, లోకం
కుహూ అంటున్నది కాదా!
నీవు కో అంటే, లోకం
కోకొల్లలుగా మేల్కొంటున్నది కాదా?
కాగా, లోకుల్ని ఎందుకనాలి?
కాకుల్ని ఎందు కనాలి?
మేధావులూ, పండితులూ, కవులూ
లోకుల నుంచి వస్తున్న వాళ్లే!
కోకిలవు నీవు కూడా
కాకి గూటిలో పుట్టి పెరిగిన దానివే!

## ౨౦. ఒంటరి చావులు

నీవు మధుమాస ప్రవక్తవు,
నేను మానవ లోక ప్రవర్తనా ప్రవక్తను!
మానవు లెక్కడున్నా, ఏ ప్రవక్త మాటా వినరు!

సహజ జడత్వం నుంచి
మానవుడ్ని ఉద్ధరించాలని
ప్రతి ప్రవక్తా అరిచి చచ్చిన వాడే!
స్వజనం చేతనే శిక్షింపబడ్డ వాడే!
ప్రతి ప్రవక్తదీ ఒంటరి గొంతే,

ఒంటరి బ్రతుకే, ఒంటరి చావే!
నా ఒంటరి గొంతు
అందుకే అపూర్వం కాదు!

నీది క్రమ వికాసం కనుక, చావు లేదు.
నేను చస్తాను కనుక, వికాసం లేదంటారు
అందరూ ఆత్మలే కనుక
పరమాత్మలలో ఎవరి చావు వారిదే!

## 21. పోలిక నిజం కాదు

ప్రవచనా లంటే
నీ పాటుల వంటివి కావు!
నీ పాటులు
జీవిత మధుకోశంలోని
సుఖ దుఃఖ మధు బిందువులు!

సుఖమూ మధు బిందువే!
దుఃఖమూ మధు బిందువే!
పగలు ఆనంద కరం
రాత్రి ఆనంద భరితం!
రెండూ స్వభావ సిద్ధాలే
ఆత్మీయతా ప్రవర్ధకాలే!

అందుకే నీతో పోల్చడానికి మరొకరెవరూ తగరు!
కొండను ఢీ కొన్నంత మాత్రాన
తగరు కొండ కాదు కదా!

పోలిక నిజం కాదని తెలిసీ కూడా
పోల్చుకోకుండా వుండడు మానవుడు!

# ౨౨. గాన గోదావరి

కాలం ముందుకు పోతూ వుంది.
మన సుఖ సంతోషాలు చంద్రగమనం తోడివే అయినా
మన కాలం సూర్య గమనం తోడిది.
కాలం ఒకొక గ్రహం మీద ఒకొక విధంగా వుంటుంది.
అది ఆయా గ్రహాల ఆవర్త గతి తోడిది.

భూమి మీద కాలం
భూ సూర్య సంబంధి!
ఇది ఎప్పుడు ప్రారంభమైందో?
స్పష్టంగా భూమి పుట్టినప్పటి నుంచే!

భూమి ఎప్పుడు పుట్టిందో?
మనకు జ్ఞాపకం లేనంతటి గతంలో!
కాళరాత్రి బ్రహ్మ ముహూర్తంలో!
అదే ఉషోదయం!

అప్పుడే నీవు తొలిసారిగా గొంతెత్తావు
ప్రతి ఉషోదయమూ నీవు తెస్తున్నదే
నీవు గానం చేస్తున్నదే
నీతో వికసించి ఫలిస్తున్నదే!

నీ గాన గోదావరి త్రిస్థాయిలో
గౌతమీ వశిష్ఠా వైనతేయాలు కాగా
ఏ శతవర్షా జలధిలో మునిగి
మాయమై పోయే నీవు
మళ్ళీ ఉషోదయంలో నవోదయంలో తేలి వస్తావు
వెలుగు తెస్తావు!

## 23. తిరగడమే తిరగడం

భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నది కదా
సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతున్నది కదా
సూర్యుడు కూడా బ్రహ్మ చుట్టూ తిరుగుతున్నాడు కదా
బ్రహ్మ కూడా మరెవరి చుట్టూనో తిరుగుతూ వుంటే
ఈ తిరగడాలకు అంతెక్కడ ?
నిజానికి విశ్వమే తన చుట్టూ తాను తిరుగుతున్నది.
సృష్టే తన చుట్టూ తాను తిరుగుతున్నది.
ప్రకృతి పురుష భావం
ఈ తిరగడం నుంచి వచ్చిందే !

నా అకాండ తాండవం కావ్యంలోని
శివ తాండవం భంగిమలన్నీ
సృష్టి స్థితి లయాల భంగిమలే !
అకాండ తాండవ గానం
ఆకాశవాణి భక్తిరంజనిలో
విన్యసిస్తున్నది, వింటున్నావు కదూ !

## 24. నిత్యోన్నవం

కాలగమనంలోని ఆవర్తాలు
యథావర్తాలా ? శంఖావర్తాలా ?
యథావర్తాలైతే అవన్నీ నిరుపయోగాలే
నిష్ప్రయోజకాలే !

సృష్టికీ దాని స్థితి లయాలకూ
ప్రయోజకత్వం వుండాలంటే
ఆవర్తాలు శంఖావర్తాలే అయి వుండాలి
ఒక దాని కంటే ఒకటి మెరుగైనదై వుండాలి

ఉన్నతమై వుండాలి, ఉన్నవమై వుండాలి
ఈ వాస్తవం నీకు తెలుసు, నాకు తెలుసు
అందుకే నిన్ను ఉన్నవోదయ ప్రవక్త అన్నాను.
నా కళ్ల ముందు తొంభైమంది ప్రవక్తలు నీవు!
తొంభై ఉన్నవ నవోదయాలను తెచ్చావు,
వినిపించావు, వెలిగించావు!

తొలి నుంచీ ప్రకృతి నాయకులం మనం
ప్రజా తంత్ర చోదకులం మనం
మన ఆంగీకమే శివ తాండవం,
మన వాచికమే విశ్వ వాఙ్మయం!

అతిశయంలో పుట్టాం
అహంకారంతో పెరిగాం!
ప్రతి కవీ అహంభావకుడే
ప్రతి కోకిలా ఆత్మాతిశయమే!
అందుకే ముందుండి నడిపిస్తున్నాం
లోకాన్ని!

సామాన్యులు చక్రావర్తులైనా
బండి సాగుతున్నదంటే
మనం చోదకులం కనుక!

## ౨౫. ప్రగతి హేతువు

మా మానవ ప్రవక్త లంతా
యథావర్తులే!
చెప్పిన సూక్తులే చెపుతారు
ఒక్కటీ ఆచరణ యోగ్యంగా వుండదు!
మా మతాలు వ్యాపారం చేస్తున్నది
ఆ అసాధ్య సూక్తులతోనే!

నీ వాక్కతివే
శంఖావర్త మూర్తివి
అదే ఈ క్రమ వికాసానికి హేతువు
ప్రగతికి మూల ధాతువు!

పరమాత్మ నుంచి ఆత్మకు
సముద్రం నుంచి అలకు
అల నుంచి సముద్రానికి
పడుతూ, లేస్తూ, మునుగుతూ, తేలుతూ
పయనించే చైతన్య లక్షణం జీవాత్మది!

జీవాత్మే ప్రాణాత్మ సృష్టికి,
అదే పురుషాత్మ ప్రకృతికి!

## ౨౬. తెలియని గతం

సృష్టిలో మొదటి వాస్తవం ఏమిటి?
ఏదీ స్థిరం కాదన్నది!
ఏ వస్తువైనా ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు
ఏమై పోతుందో తెలియదు
ముందూ తెలియదు, తరువాతా తెలియదు
ఈ నడుమ జీవితం
ఎంత కాలమో తెలియదు
ఎలా నడుస్తుందో తెలియదు!

కర్త లేకుండా కర్మ జరుగదు కనుక
సృష్టి కంతకూ ఒక కర్త వుండాలన్నది
మానవుడు చేసిన మొదటి ఊహ!
సంబంధ బాంధవ్యాలు లేకపోయినా
స్వభావం సర్వత్రా ఒక్కటే కనుక
సమస్త మానవుల తొలి ఊహ

సృష్టి కర్తను గురించి నట్టిదే!
ఆ తొలి ఊహ
పెద్ద అపోహ అయింది
చిలవలు వలవలు తొడిగింది
వెర్రితలలు వేసింది
కుక్కమూతి పిందెలు కాసింది
ఇప్పటి కింకా పరస్పరావగాహన మృగ్యం చేస్తూ
స్వప్రయోజక నాయకత్వం నిలుపుకొంటున్నది!

అట్టి ప్రవక్త నామధేయంతో
నీకూ నాకూ పోలికే లేదు!

## 27. గతానుగతి

ప్రవక్త అనే పదం మేం సృష్టించినది
అంటే మానవులం సృష్టించినట్టిది
ప్రవక్త, దైవజ్ఞుడు, పైగంబరు, ప్రాఫెట్టు
ఇటువంటి పదాలన్నీ సమానార్థకాలు!

గతాన్ని సంస్కరించి
వర్తమానాన్ని సమున్నత పరచి
సమున్నవం చేసి
భవిష్యత్తును సూచించే ప్రజా నాయకుడ్ని
ప్రవక్త అన్నారు. పైగంబరు అన్నారు.
సామాన్యుడికి వుండే భావాలే
నాయకుడికీ వుంటై,
సామాన్యుడు చెయ్యలేని పనిని
నాయకుడు చెయ్యగలడు.
సామాన్యుడంటే గతాన్ని అంటిపెట్టుకొని వుండేవాడు
గతంపై ఆధారపడి బ్రతికేవాడు

గతాన్ని అనుసరించి నడుచుకొనేవాడు
గతంలోని లోపాలను సహించేవాడు
ధిక్కరించే ధైర్యం లేనివాడు!

నాయకుడలా కాదు,
కాలాన్ని తన కనుకూలంగా
మలుచుకోగలవాడు నాయకుడు
కార్యసాధకుడైన నాయకుడ్నే ప్రవక్త అన్నారు!
అట్టి మానవ ప్రవక్తతో
ఉషోదయ ప్రవక్తవైన నిన్ను
పోల్చవచ్చునా?
ప్రవక్త అనే పేరు
నీకు సరిపడుతుందా?

## 28. ప్రవక్తలూ - సమాజాలూ

భూమి పైని గల
వాస యోగ్య ప్రాంతాలలో
ఒక ప్రాంతానికీ, మరొక ప్రాంతానికీ
సంబంధ బాంధవ్యాలు లేని సుదూర గతంలో
మానవుడు సమాజాలుగా ఏర్పడి
జీవించ సాగిన కాలం నుంచీ
ప్రవక్తలు పుడుతూనే వచ్చారు!
ఊహలు చేస్తూనే వచ్చారు!
దేశ కాల పరిస్థితులను బట్టి
తమ తమ సమాజాలను మలుస్తూనే వచ్చారు!
ఊహాలు వాస్తవాధీనాలు,
వాస్తవ పరిధులను దాటి వెళ్ల వవి!

అయితే....

పంచభూతాధీనమ్మైన వాస్తవాలు
నిలకడ కలవి కావు
ఊహలూ అంతే!

మానవ సమాజం కుమ్మరి మన్ను
కుమ్మరి వాడి ఊహలను బట్టి
పాత్రలు తయారయినట్లు
ప్రవక్తల ఊహలను బట్టి
సమాజాలు రూపొందుతై!

ఎందరో ప్రవక్తలు,
పరస్పర అవగాహన లేని ప్రవక్తలు!
ఎన్నో సమాజాలు
పరస్పర సంబంధాలు లేని సమాజాలు!
అది గత చరిత్ర!

గతానుగతికంగా సాగిపోవడమే
స్వభావమ్మైన సమాజాలు
ఇప్పటికీ అలాగే సాగుతున్నై!
గతాన్ని పట్టుకొని వేలాడుతూ
వర్తమానాన్ని ముందుకు పోనివ్వడం లేదు
భవిష్యత్తు క్రమ వికాసం పట్ల
ఆసక్తి లేదు, అవగాహన లేదు.

## 29. దుంప తెంచే భ్రాంతులు

లోకంలోని అన్ని ప్రాంతాలూ నీవే
అన్ని మతాలూ నీవే
అన్ని భాషలూ నీకు వచ్చు.

ఇంగ్లీషులో రెండు మాటలున్నాయి,
అందులో బ్లాస్ఫెమీ అనేది ఒకటి

జనరేషన్ గేప్ అనేది మరొకటి.
తెలుసు కదా !

ఈ రెండు మాటలూ నా దుంపె కాదు
మానవ జాతు లన్నిటి దుంపా తెంచుతున్నాయి
ఈ రెండూ వట్టి భ్రాంతులు
కేవలం అపోహాలు !

పవిత్ర యుద్ధాలంటూ
అపవిత్ర హత్యలు చేసేది
బ్లాస్ఫెమీ !
ఆచారం, సంప్రదాయం, అనువంశికం
అంటూ పాత సరుకునే
కొత్త సీసాల్లో పోసేది
జనరేషన్ గ్యాప్ !

అక్కడ పవిత్రతా లేదు.
ఇక్కడ అంతరమూ (గ్యాపూ) లేదు !

## మత్త కోకిల

నిన్ను ప్రవక్తా అన్నాను,
అవును, నీవు ప్రవక్తవే !
నా కిప్పుడు తొంభై ఏళ్లు !
గత తొంభై ఏళ్ల లోనూ
తొంభై వసంతాలు వచ్చి పోయినై
వసంతానికి ప్రవక్త కోకిల, నీవే !

తొంభై వసంతాలకూ తొంభై మంది ప్రవక్తలు !
ప్రతి కోకిలా తెస్తున్నది వసంతాన్నే,
ప్రతి వసంతమూ ఇస్తున్నది
యవ్వన మాధుర్యాన్నే !

యవ్వనం వస్తున్నది, పోతున్నది
మళ్లీ వస్తున్నది, పోతున్నది
మళ్లీ మళ్లీ అదే, అదే మళ్లీ మళ్లీ !
ఇందులో జనరేషన్ గ్యాప్ ఏమున్నది ?

పిన్నలను వెక్కిరించడం, శాసించడం
పెద్దలను నిరసించడం, ధిక్కరించడం
ఇందులో జనరేషన్ గ్యాప్ ఏమున్నది ?

## 31. రాజపిత

తమ తమ తల్లిదండ్రులే ఆదర్శంగా
మానవజాతి బ్రతుకుతున్నప్పుడు
ఒకానొక డైనోసరస్సు మహారాజయ్యాడు
ప్రజలు తమ తల్లి దండ్రులను, పూజించకూడదని
రాజొక్కడినే తల్లిదండ్రిగా ఆరాధించాలని
శాసించాడు, నిర్బంధించాడు
అదే ఏకేశ్వరోపాసనగా స్థిరపడింది.

ప్రజ లెవ్వరికి తల్లిదండ్రులు లేరట,
తల్లీ తండ్రీ రా జొక్కడే నట.
ప్రజలకు వ్యక్తిత్వం పోయింది.
రాజ శరణాగతి మిగిలింది.
రాజ శాసనం భయపెట్టగా దాని నీడలో
భక్తి పెరిగి వెర్రితలలు వేసింది.

రాజును ధిక్కరించ కూడదు
రాజ శాసనాన్ని ప్రశ్నించకూడదు
అవి రెండూ ఘోర నేరాలు
అదే బ్లాస్ఫెమీ !
బ్లాస్ఫెమీకి భయపడ్డ జనం

కట్టుబానిసలుగా బ్రతకడమే
అయింది ఘనం!

## 32. తోడు దొంగలు

తాను ఒక్కడే జగద్గురువు ననుకొన్న నాయకుడు
గురువే దైవ మన్నాడు.
దైవాన్ని త్రిమూర్తులుగా విడగొట్టి
త్రిమూర్తులూ తానే నన్నాడు.
తానొక్కడే మహేశ్వరుడుగా
చలామణి అయ్యాడు.

ప్రజలు శిరసా వహించారు.
శిరసా వహించని వాళ్ల
శిరస్సులు ఖండించ మన్నాడు.
కొందరు శిక్షకు గురయ్యారు.
ఎక్కువమంది భయంతో భక్తు లయ్యారు.

ఆ విధంగా, భయ భక్తులు
తోడు దొంగ లయ్యాయి
ఈ భయ భక్తులే నేటి మతాలు,
నేటి సామాజిక గురువులు,
నేటి ప్రవక్తలు, వాళ్ల ప్రవచనాలు!

## 33. శుక్ర నీతే నీతి

బృహస్పతి, శుక్రాచార్యుడు, మహావీరుడు, బుద్ధుడు
శంకరాచార్యుడు, చండాలుడు, సుమతి, వేమన
ఇటువంటి ఎందరో, ఎంద రెందరో ప్రవక్తలు!
ఒకడు అబద్ధం ఆడవద్దంటాడు
దొంగతనం చెయ్యవద్దంటాడు.

తల్లి దండ్రుల మాట వేద సమానం అంటాడు
గురువే దైవ మంటాడు ఇంకొకడు !
హింస చెయ్యవద్దంటా డొకడు
అయితే, మాంసం తినవచ్చు అంటా డతడే !
మనిషిని ఖైలి వేస్తా డొకడు
శరీరాన్నా, ఆత్మనా అని అడుగుతా డింకొకడు !

నాకు నచ్చిన ప్రవక్త శుక్రాచార్యుడు !
బొంక వలసిన ప్రతి సందర్భంలోనూ
బొంకడం తప్పు కాదన్నాడాయన !
వాస్తవమైన ప్రవచనం !

అందుకే శుక్ర నీతి
అందరికీ అనుసరణీయమైంది,
అమలు జరుగుతున్నదీ అదే !

## 34. నమ్మకమూ - బుద్ధీ

నమ్మకానికి రూపమూ లేదు,
బుద్ధికి నిలకడా లేదు !
అది నా దయినా గాని, మరొకరి దయినా గాని
నేను నమ్మేదంతా నాకు నిజమే
మరొకడికి అది నిజం కాకపోవచ్చు
నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలే !

బుద్ధి పూర్తిగా వ్యక్తిగతం !
అది పామరుడికీ వుంది, పరమ జ్ఞానికీ వుంది !
తేలిందేమిటంటే...
ఎవడి నమ్మకం వాడిది, ఎవడి బుద్ధి వాడిది !
వాటికి సామూహికత లేదు,
సార్వత్రిక లేదు !

అందుకే నేను చెపుతున్నాను,
సృష్టికి కర్త ఒకడే అనడం నిజం కాదని!
ఏకేశ్వరం శాసనం ఏక పక్ష నియంతృత్వ మని!

## 32. వికలాంగులు

కోకిలా .....
గొప్పవాళ్లకు తలంటి పోసే
అదృష్టం నీకెప్పుడైనా కలిగిందా ?
నీకు కలగదు!
అది కాకులకు మాత్రమే రిజర్వుడు!
గొప్పవాళ్లకే కాదు,
వాళ్ల విగ్రహాలకు కూడా
తలంటి పోస్తా యవి!
నీ వెపుడైనా
లిబర్టీ శిల్పాన్ని చూశావా ?
ముళ్ల కిరీటంతో, ఒక చేతితో కాగడా పైకెత్తి
మార్గ దర్శకంగా
మధ్య వీధిలో నిలబడ్డ విగ్రహం!

చెడు నుంచి విముక్తిని కోరే మంచివాడు
ఎల్లప్పుడూ ముళ్ల కిరీటం ధరించ వలసిందేనా ?
కళ్ల గంతలు లాగి పారేసి
న్యాయదేవత సూటిగా లోకాన్ని చూడలేదా ?
చెడు అనను, కనను, వినను అనే కోతులు
వికలాంగులుగా వుండి పోవలసిందేనా ?

ఈ వేటినీ ప్రవక్తల దోషాలనడం లేదు నేను!
వాళ్ల అహంకారమే ప్రజలను
నిత్య మూర్ఖులుగా అణచి పెడుతున్నది!

అందుకే ప్రజలు మారడం లేదు.
లోకం ఇంకా దిగజారి పోతున్నది!

## 36. అనంతావకాశాలు

పితృ దేవతలకు తద్దినాలు పెట్టేవాళ్లు
వాళ్లు నిజంగా వచ్చి తింటే పెడతారా?
దేవతలకు నైవేద్యం పెట్టేవాళ్లు
వాళ్లు వచ్చి వాటిని ఆరగిస్తే?
యజమానిని విందుకు పిలిచిన వాడు
అతడు ఎక్కువ సేపు కాలక్షేపం చేస్తే
తల క్రిందులై పోడా?
లోక మర్యాదలకు చేసే కొన్ని పనులు
స్వప్రయోజనాల సరిహద్దు దాటవు!

పండగలు అలాంటివి కావు
అవి ఆనందోత్సాహాలకు నెలవులు
ఆనందోత్సాహాలు
ఆయుర్వేద నిధులు!

అయితే మనకు సరిహద్దులు లేవు!
మనవి ఒంటరి గొంతు లైనా
అవధులు లేని పంచమ స్వరాలు!
అనంతావకాశాలలో ప్రపంచ పూర్ణ కలశాలు!

## 37. కాకులూ, కోకిలలూ, ప్రజలూ

సుఖ శాంతులకు కోకిల ప్రతీక,
వార్తా విన్యాసాలకు కాకి ప్రతీక!
జీవితంలో సుఖశాంతులు అరుదు,
నీ దర్శనం కూడా అరుదైనదే!

లోకంలో కాకులు కోకొల్లలు !
ఊళ్ళలో వీధుల నిండా అవే,
పితృ కార్యాలలో అదే వాటి ప్రాముఖ్యం !
పితృ దేవతలు కాకుల రూపంలో వచ్చి
పిండాలను తినిపోతారట !
కాకులు రూపం లోనే ఎందుకు వస్తారు ?
మరో రకం పక్షులు అందుబాటులో వుండవు కనుక !

నిజానికి.......
కాకీ, కోకిలా ఒకే జాతివి
కోకిల అంతఃపుర కాంత,
కాకి రోజు కూలీ !
తేలిగ్గా దొరుకుతుంది,
కాలుష్యాలను శుభ్రపరిచి పోతుంది !

## 38. నీతి సాంఘికం

కోకిలా !
చారిత్రకంగా బుద్ధుడు మొదటి ప్రవక్త
అతడ్ని అహింసా జ్యోతి అన్నారు,
ఏదీ అహింస ?

అతడ్ని ఆరాధిస్తున్న దేశాలన్నీ
ప్రధానంగా మాంసాహార దేశాలే !
దండనీతి రాజరికాలే !
మానవ స్వభావానికి వ్యతిరేకంగా
సామాజిక నీతులు చెప్పేవాళ్లు !
అతీత శక్తులు గల ప్రతి వాడ్నీ
దైవావతారంగా ప్రకటించేసి
తాము హాయిగా తలుపులు బిగించుకుని

మెత్తగా బ్రతికేసే వాళ్లే!

ప్రకృతి నైజాన్ని ఉన్నతీకరిస్తూ
ఉత్సాహ పరిచే ప్రవక్తవు నీ వాక్కతివే!
అందుకే నీవు నా మార్గదర్శివి!
అయితే, ప్రవక్తల్ని నేను విమర్శించడం లేదు
వాళ్లు అసామాన్యులు,
ప్రజల మేలు కోరిన వాళ్లు!
మానవతను ఉన్నతీకరించడానికి
శాయ శక్తులా పని చేసిన వాళ్లు!
వీర పూజ స్వభావమైన మానవులు
వారిని ఆరాధిస్తారు!
తృప్తి నిచ్చే మార్గం ఇంతకన్నా ఏముంది?

## 39. అజ్ఞాత ప్రవక్తలు

ఏకాంత సేవ తెలుసు కదూ,
వెంకట పార్వతీశ్వర కవుల కావ్యం!
ఏకాంత సేవ నీ సేవే!
అందులోని నీవే
నన్ను ఉద్బోధించిన ఏకైక ప్రవక్తవు!

"వర మనోహర పంచమ స్వరము నెత్తి
పాడవేమమ్మ కోకిలా, పాడవేమే?"
అనే పిలుపే నా పంచమ స్వర కావ్యానికి శ్రీకారం!

అంతటి మహాశక్తివి
అంతే వాసివా?
ప్రభాత భేరీవి
పరభృతానివా?
ఉన్నవోదయ ప్రవక్త

ఉపేక్షింప బడడమా !
కాదు, కాగూడదు !

మన ప్రవక్తలలో వందలు వేలు వత్సరాలు
అజ్ఞాతంగా వుండిపోయిన వాళ్ళు
చాలమందే వున్నారు !
శంకరాచార్యుడ్ని ప్రసిద్ధికి తెచ్చిన
చండాలు డంతటి అద్వైత ప్రవక్తకు
పేరూ ఊరూ కూడా లేదు !
బెంగ పెట్టుకోకు,
భవిష్యత్తు మనదే !

## 40. రాజకీయం కాదు

కుడి నుంచి ఎడమకు వ్రాసినా
ఎడమ నుంచి కుడికి వ్రాసినా
వాక్యం అదే !

ఏ సంప్రదాయమైనా
అనుకూలతను బట్టి అమలవుతుంది
ప్రజామోదాన్ని బట్టి ప్రచార మవుతుంది
సహజత్వాన్ని బట్టి సంస్థిత మవుతుంది !
సహజత్వం నిలుస్తుంది,
అసహజత్వం అంతరించి పోతుంది !
అబద్ధాలు అనే కానేకం,
చౌర్యం శతాధికం !
ఈ రెండూ లేకుండా
ప్రభుత్వమూ లేదు, ప్రజాస్వామికమూ లేదు !

ప్రభు సమ్మితమైన వేదాలను చేపట్టి
ప్రజాస్వామికం పేరుతో
ప్రజలను పాలిస్తున్నారు ప్రవక్తలు,

వాళ్ల సహచరులు, వాళ్ల అనుచరులు !

సహజ జీవన ప్రతిపాదకం నీ గొంతు
రాజకీయ అవకాశ వాద ప్రవక్తం కాదు !

## 41. పేరులోనే వుంది

పేరులో ఏముంది పెన్నిధి
అనే లోకోక్తి విన్నావు కదూ !
లోకోక్తు లన్నీ సర్వ సత్యాలు కాదు !
పేరు లోనే వుంది వ్యక్తిత్వం !
అన్య జీవరాశులకు అక్కర లేకపోవచ్చు,
గుర్తింపు కోసం పేరు కావాలి మానవుడికి !
మనిషి పేరు పెట్టని దేదీ లేదు సృష్టిలో !

జంతు జాలానికి జాతుల పేర్లు చాలు,
పెంపుడు జంతువు లైతే
వ్యక్తి గత పేర్లుంటై !
వాల్మీకి పశుల మందలో
కల్యాణి తెలుసు కదా !

మానవ జాతిలో అయితే
ప్రతి మనిషికీ ఒక పేరుంటుంది
గాంధీజీ అంటే ఒక ప్రత్యేకమైన పేరు
అంబేడ్కర్ అనేది మరొక పేరు
ఏ పేరు కా పేరే ప్రత్యేకం,
విశిష్ట గుణ శీలాలు కలిగినట్టిది !

ప్రసిద్ధుల పేర్లు నాలుగై దక్షరాలకు మించవు
పేరు ఎంత పొట్టిగా వుంటే
వ్యక్తిత్వం అంత పొడుగ్గా వుంటుంది
నామ రూప రహితమైన విశ్వశక్తిని కూడా

పరమాత్మ అంటున్నాం
పేరు ప్రఖ్యాతులు, కీర్తి ప్రతిష్ఠలు
పేరు తోనే ప్రవర్తిస్తై!
విశ్వ శక్తిలో ప్రతి అలకూ పేరుంది.
సామాన్య వ్యవహారంలో
ఏ పేరైనా ఒకటే కానీ
విశిష్ట స్థానంలో పేరే ప్రధానం!
పేరులోనే వుంది
ప్రతిష్ఠ, పదవి, అధికారం, పెన్నిధి సమస్తమూ!

## 42. నేరం ప్రవృత్తి కాదు

''అప్పు చేసి యైన పప్పన్నమే తిను
కాపి కొట్టి యైన క్లాసు పొందు
దొంగిలించి యైన దొరలాగ బ్రతకరా
సహజ ధర్మ మిది ఇహ పరాల!''

ఆధునిక మానవ ధర్మానికి ఇలా
రూపం దిద్దాను పూర్వం ఒక సమ్మేళనంలో!
సదస్యులు హర్షధ్వానాలు చేశారు
సర్వకాలాలలోనూ
ఇవి నగ్న సత్యాలే కదా!

మనమూ మన ప్రభువులూ తింటున్న పప్పన్నం
ఎలా వస్తున్నది?
పెద్ద పెద్ద పదవులలో వున్న దొర కుమారులంతా
ఎలా సంపాదించారు ఆ పదవులు?
ఈనాటి నవాధునిక కోటీశ్వరు లందరూ
ఎలా అధిరోహించారు ఆ శిఖరాలు?

ధర్మ విరుద్ధమైన, ఆచరణ సాధ్యం కాని

నీతులు చెప్పే ఏ ప్రవక్త అయినా
చేతులు నలుపుకుంటూ కూర్చునే వాడే!
తమకు దక్కని సుఖాలన్నీ
అవినీతు లవుతాయా?
అవుతాయంటే వినే దెవరు?
పట్టించుకునే దెవరు?
అందుకే నేర ప్రవృత్తి అనేది
సహజ ప్రవృత్తి కాదు అంటున్నాను!

## 43. అంతా తనకే

''కుక్కలు చింపిన విస్తరి
నక్కల పాలైన నంది, నాయకులు తలో
ముక్కను తినగా, మిగిలిన
బొక్క సుమీ జాతి ఈ డెమోక్రసీ లోనన్''

అంటూ డెమోక్రసీ వర్ణించాను
చాలాకాలం క్రితమే!
అందమైన వివరణ కూడా ఇచ్చాను ఆనాడే
ఇదీ నగ్న సత్యమే కదా!
నగ్న సత్య మంటే పరబ్రహ్మ అన్నమాట!
పరబ్రహ్మ మౌలికం కావచ్చు
జీవితానికి మూలం కావచ్చు
వికాసానికి ఆధారభూతం కావచ్చు
ఆత్మ ఆత్మగా జీవించడానికి
పరమాత్మ ఎందుకు పనికి వస్తుంది?

అందులో నా రాగోదయం గేయాలలో అన్నాను...
''సారాహార సమార్జన వేళ్లది,
సన్మానము పూవులది!

కష్ట మొక్కరిది, సుఖ మింకొకరిది
కాంతా, నైజము సృష్టి కిది! ''

ఈ సత్యాన్ని చెప్పేదే
అందరూ అందలం ఎక్కే వాళ్లే అయితే
మోసే వాళ్లెవరు అనే సామెత!
సృష్టి స్వభావమే అంత!

పోరాడి పదవిలోకి వెళ్లే కార్మిక నాయకుడు
కఠిన నియంతగా మారిపోతాడు
తోసుకు వెళ్లి రైలెక్కే ప్రయాణీకుడు
తా నెక్కేసి ద్వారం బిగించేస్తాడు.
జీవకోటి ఏ రాశిదైనా
ప్రకృతి ధర్మం మాత్రం ఇదే!
ఈ ధర్మం మారాలంటే
మరొక ప్రళయం రావాలి
ప్రళయం రాకుండానే ప్రగతి సాధ్యపడాలంటే
నీ ఉన్నవోదయ ప్రవచనం ఒక్కటే మార్గం!

అందుకే అంటున్నాను
నీ వొక్కతెవే ప్రవక్తవు అని!
నీది ఒంటరి గొంతు కాదు అని!

## 44. బృంద నాయకత్వం

నీ దెప్పుడూ బృంద నాయకత్వమే!
ప్రస్తుతం నీతో నీ వాళ్లు లేకపోవచ్చు,
నీతో నేనున్నాను కనుక
నీవు ఒంటరి దానివి కాదు!
ఏకాంతంగా నాకేదో చెప్పవచ్చిన
పరాత్పర వైతాళికవు నీవు!

నాదీ ఒంటరి గొంతు కాదు!
కవికోకిల జాషువా అన్నట్టు
''గవ్వకు సాటిరాని పలుగాకులు మూకలు
అసూయచేత'' నాకు దూరమయ్యారు
అలా - నాది ఒంటరి గొంతయింది.
నే నెప్పుడూ నా కోసమే పాడుకొన్నాను
నా కోస మంటే నీ కోసం
నీ కోస మంటే లోకం కోసం
లోకాభ్యుదయమే నా ధ్యేయం!
దానిని సాధించడానికే నా గేయం!

నా సొంత వంట
లోకానికి సరిపడే భోజనశాల!

## శ్రావణ కోకిల

కోకిలా....
నీవు వసంతానికి సంకేతం అన్నారు కవులు,
అది వాళ్ల ఊహ!
కవి సమయాలు ఎక్కువగా వాస్తవాలే!
అయినా నీవు అన్ని కాలాల లోనూ పాడతావు!

కాలాన్ని పునర్విభజన చేయాలి
ఇప్పుడున్న ఆరు ఋతువులూ సరిగా లేవు
మన పల్లెటూళ్ల ననుసరించి
నే నిలా విభజిస్తున్నాను....
ఎండ కాలం, వాన కాలం, చలి కాలం!
మార్చి నుంచి మొదలై
నాలుగేసి నెలల మూడు కాలాలివి!
నీవు అన్ని కాలాలలోనూ పాడతావు!

కొంగ్రవెన్నూ, తాటితొక్కా పట్టుకొని
అత్తింటికి పోయే శ్రావణ కోకిలను
నేను వర్ణించిన సంగతి నీకు తెలుసు కదా!

ఆకాశవాణిలో వినిపించిన ఆ కవిత
ఎంత ప్రజామోదం పొందింది!
అత్తింటికి పోతూ, నీవు కూడా
ఆనందించే వుంటావు!

## 46. శృంగారమే రసం

శృంగార రసం ఒక్కటే రసం అన్నాను
ఏకో రసః కరుణ ఏవ
అన్న ఏ జీవితం పరిపూర్ణం కాదు!

కరుణం ఒక రసమే కాదు!
భగ్న శృంగారం కరుణం
నిరుద్ధ శృంగారం వీరం అన్నాను కదూ!
శృంగారం రస రాణి
ఏత దనుచర సహచర బృందం
తక్కిన రసోపరసా లన్నీ!

అందుకే నీ వొక్కతెవే వాస్తవ ప్రవక్తవు
తక్కిన మా ప్రవక్త లందరూ
ఊహాపోహల వీధి గారడీలు!

## 47. మత గ్రంథం కాదు

వాల్మీకి రామాయణం వ్రాశాడు
వాల్మీకి కవి, అతని కల్పన రామాయణం!
ప్రకృతి ధర్మాన్ని అనుసరించి చేసిన సృజన అది!
జనంలో రకరకాలుగా వున్న కథను

సంస్కరించి, భారతీయం చేసిన
మానవ సృజనకు పరాంకోటి అది!

మానవ జీవితానుభవంలోని
సర్వావస్థలూ అందులో వర్ణితాలు!
సుఖదుఃఖాలూ, జయాపజయాలూ
విజయ యాత్రలూ, విఫల యత్నాలూ అన్నీ!

మా వాళ్లు ఏం చేశారు దాన్ని?
వాల్మీకిని కోకిల అన్నారు.
పితృవాక్య పరిపాలనమే
రామాయణంలోని కేంద్ర బిందువన్నారు
మరి కొందరు భక్తి మైకంతో
రాముణ్ని దేవుణ్ని చేశారు.
దేవుణ్ని అమహితుణ్ని చేశారు.

రామాయణంలో పితృవాక్య పరిపాలన ఎక్కడుంది?
సవతి తల్లి నిర్దేశమే పితృవాక్యమా?
పితృ వాంఛా ధిక్కారం కాదా
రాముడి వనవాస యాత్రకు ప్రాతిపదిక?

రాముడు మానవు డయినప్పుడే
రామాయణం మానవుడికీ పఠన యోగ్యం!
సర్వశక్తి మంతుడైన భగవంతుడే
మాయా వేషంలో మనుషుల మధ్యకు వస్తే
అది మాయ సీతలా ఉపేక్ష్యం,
మాయ లేడిలా నిరపేక్ష్యం!

రామాయణం కావ్యం,
మత గ్రంథం కాదు!

## 48. చరిత్రే పంచమ వేదం

పృథివి రూపమే పృథ, కుంతి!
పృథ కొడుకు పార్థుడు,
పంచ భూతాలే పంచ పాండవులు
పృథ వాటి తల్లి!

పంచజనుడి వంశం వాళ్లే
పంచము లన్నాను నేను,
వాళ్లే పంచ పాండవు లన్నాను కూడా!
పంచముడిచే వ్రాయబడిన పంచముల చరిత్రే
పంచమవేద మయింది అన్నాను!
మహా భారతం పంచమ వేదమే కదా!

దీనికి కూడా అపార్థాలు కల్పించి
జాతిని అస్వతంత్రం చేశారు
అగ్ర స్థానా లధిష్ఠించిన వాళ్లు!

వాస్తవాలను నే నెంత అరచి చెపుతున్నా
ఉచ్ఛ స్వరంతో ఉద్బోధిస్తున్నా
వినపడనంతగా ప్రజల మెదళ్లను
బ్రెయిన్ వాష్ చేసి వుంచింది వర్గం!

లోకానికి నాది ఒంటిరి గొంతే,
ధర్మానికి మాత్రం సత్యార్థ ప్రకాశిక!

## 49. నదీ తీరం

సూర్యుడు, చంద్రుడు, మేఘం, వర్షం
నది, దాని ఒడ్డున ఒక చెట్టు
చెట్టు నీడన నేను,
చెట్టు పైన నీవు!
ఇదీ జీవితమంటే!

చుట్టూ విస్తరించింది అరణ్యమైతే
అది ప్రకృతి ధర్మం,
ఉద్యానమైతే మానవ జీవితం!

అరణ్యాన్ని ఉద్యానవనంగా మార్చడానికి
మానవుడు చేస్తున్న అవకతవక లెన్ని?
సృష్టిస్తున్న అయోమయత ఎంత?

అంత వరకూ పర్వాలేదు, కానీ
తన సుఖం కోసం, తాను మాత్రమే బ్రతకడం కోసం
మొత్తం అరణ్యాన్నే నాశనం చెయ్యడం
క్షమార్హం కాదు!
అడ్డుకొనే దెవరు?
అందరూ పరమాత్మలే!

## ౫౦. స్వేచ్ఛ

తన ఇచ్ఛ కొనసాగడమే
సుఖ జీవితం!
భయ భక్తులు దానికి సంకెళ్ళు!
భయ భక్తులతో బ్రతకడం
బానిసత్వమే కదా!
ఏమి చేస్తే ఎవరికి కోపం వస్తుందో
అనే భయమే భక్తికి మూలం!
కులం పేరుతో, మతం పేరుతో
పౌరసత్వం పేరుతో, సంఘనీతి పేరుతో
వివిధ నాయకులూ ప్రజల్ని పరిపాలిస్తున్నది
ఈ భయం భక్తుల ఆయుధాలతోనే!

ఈ ఆయుధాలు ప్రగతి నిరోధకాలు!
నాయకుల చేతుల్లో అవి వుంటే

ప్రజలకు స్వేచ్ఛ లేదు, సుఖశాంతులు లేవు !
నిజంగానే ఈ ఆయుధాలు లేకపోతే
అల్లకల్లోలం కాదా లోకం ?

అందుకే ఈ భయ భక్తులు
తప్పనిసరి పీడలుగా
సహించబడుతూ వున్నై,
శిరసా వహించ బడుతూ వున్నై !
భ్రాంతి... లోనే కాంతి, శాంతి !

## 51. అధర్మం

''నిన్ను నిబద్ధు చేయు
నీ భీకర శత్రు లార్వుర ప్రభిన్నుల చేసిన మీద
ధాత్రిలో నీకు విరోధి లే డొకడు''
అంటూ పోతన గారు భాగవతంలో
ఏ ఆర్వురి గురించి చెప్పాడో
ఆ ఆర్వురి నే అరిషడ్వర్గం అన్నారు.
నిరసించారు, అందువల్ల నీరసించారు,
మన నడమంత్రపు పెద్దలు !
ఉద్రేకాలను చంపుకొని
కోరికలను అవాచుకొన
అసమర్థులైనారు
అధః పతితులైనారు !
స్మృతుల యుగమే మన
నడమంత్రపు కాలం !
భీకర శత్రువులుగా నిరసించబడిన
ఈ ఆరు గుణాలే
మానవుడికి రక్షా కవచంగా
ప్రకృతి ఇచ్చిన సెక్యూరిటీ గార్డులు !

ఈ ఆరు ఉద్రేకాలూ లేకపోతే
మానవుడు బ్రతకనే బ్రతకడు

అయితే.....
అవి ఎప్పుడూ
యజమాని అదుపులో వుండాలి!
ఇందులో మూడు
కామ లోభ మోహాలు పాజిటివ్!
క్రోధ మద మాత్సర్యాలు నెగిటివ్!
మానవుడు ఎదగడం లేదు.
విస్తరిస్తున్నాడు!
రామాయణంలో శూర్పణఖను విరూపను చేయడం
భారతంలో ద్రౌపదీ వస్త్రాపహరణం
అలాగే నిన్న మొన్నటి
నేపాల్ రాజకుటుంబం హత్య
చెన్నైలో మాజీ ముఖ్యమంత్రి హింస
ఆలోచిస్తున్నావా, కోకిలా?

## 52. స్వార్థా బంధం

ఋణానుబంధ రూపేణా
వసు పశూ సుతాలయ
అనే పూర్వ ఋషుల సూక్తిని విన్నావు కదూ!
పూర్వ ఋషుల "పశుపత్నీ" ని
"వసు పశూ" అని మార్చాను నేనే!

మానవులలో పతి గాని, పత్ని గాని
అనుకొనే మాటలివి!
అందుకని వాళ్లిద్దరినీ వదిలేశాను!
ఋణానికి సంబంధించిన ఉభయ పక్షాలూ

ఒకరి నొకరు హింసించుకోవడం చూసి
దానిని ప్రారబ్ధ కర్మకు ముడిపెట్టిన సూక్తి ఇది!
దేవుడు లాంటిదే ఇది కూడా!

నిజానికి మానవుడిని హింసించేవి ఈ నాలుగే!
ధనం, పశువులు, పిల్లలు, ఇల్లు!
అనుకూలంగా వుంటే మిత్రులు,
ప్రతికూలంగా వుంటే శత్రువులు!

నేపాల్ రాజకుటుంబ హత్యాలే ఎందుకు?
అలాంటివి మొత్తం మీద
ప్రతి కుటుంబంలోనూ జరుగుతున్నట్టివే!
కృత్రిమ నైజం పెంచుకొన్న మానవ జాతికి
ఇది ప్రత్యేకం!
నీవు అదృష్ట వంతురాలివి!
నేను మానవుణ్ని,
కృతక స్వార్థంలో కూరుకు పోయిన వాణ్ని!
సోమరిపోతు లైన వాళ్ళు
స్వతంత్రంగా బ్రతకలేని వాళ్ళు
వారసత్వపు ఆస్తులకై
హత్యలు చేసే క్రిమికీటకాలు!
అట్టిది కృతక స్వార్థం,
సహజ స్వార్థం కాదు!

## 53. ఎవడికి వాడె

గతం నుంచి నేర్చుకోడు మనిషి
మనిషే కాదు, ఏ జీవి నేర్చుకోదు,
నేర్చుకోవడానికి గతంలో ఏముంది కనుక?

గతం నిండా ఎందరో

మార్గ దర్శకులు ఉన్నారు కదా అంటే!
గతం నిండా మేధావులున్నారు
వాళ్ళంతా తమ దారిన తాము పోయిన వాళ్ళు.
ఎవరికీ మార్గ దర్శకులు కారు.
గతంలోని ఒక్క మేధావిని
అనుసరించిన వ్యక్తి ఆ తరువాత ఒక్కడూ లేడు

గతంలోని గొప్ప వాణ్ని మేధావి అన్నారు
గురువు అన్నారు
ప్రవక్త అన్నారు
దేవుడు అన్నారు
అంత గొప్పవాళ్ళను అనుసరించగలమా అనుకొంటూ
తమ దారిన తాము పోయే వాళ్ళే అందరూ!
అది స్వభావం, అది నైజం!
ఎవరికి వారే యమునా తీరే
అనే సూత్రం ఇదే కదా!
ప్రతిజీవికి తన సుఖ దుఃఖాలు తనవి
తన బ్రతుకు తనది అంతే!

## 54. రాజు తప్పు చేయడు

రాజు తప్పు చెయ్యడు అనేది ఒక ఆంగ్ల సామెత
రాజే కాదు, కవి కూడా తప్పు చేయడు!

కవి, చిత్ర శిల్పి, పరిపాలకుడు వగైరా
ప్రజా సంబంధీకు లెవరూ తప్పు చెయ్యరు
వాళ్ళు ఏమి చేసినా ప్రజల కోసమే!

ప్రజలంటే మెజారిటీ ప్రజలు
మైనారిటీ ఎప్పుడూ ప్రతి పక్షమే!
మెజారిటీ ముందుకు పోతుంటే
మైనారిటీ అడ్డుకొంటూ ఉంటుంది.

రాజుకు, కవికి, చిత్ర శిల్పికీ శత్రువులుండ కూడదు,
మదోన్మత్తులు మాత్సర్యం పెంచుకొంటారు
మాత్సర్యం జీవ లక్షణం కాదు.

అందుకే
నేపాల్, చెన్నై సంఘటనలు
అమానుషాలే కాదు,
ప్రకృతి విరుద్ధాలంటున్నాను.

నీ సుఖం నీవు చూసుకో,
మరొకరి పై పగ పట్టవద్దు!
పగ ప్రకృతి విరుద్ధం!
చర్యకు ప్రతి చర్య తక్షణ కాలికం,
దీర్ఘ కాలికం కాదు!

## 55. మానవ నైజం

ఆకలి, దాహం, కామేచ్ఛ
వీటిని తీర్చుకోవడానికి పడే పాట్లు
ఇదే కదా మానవ జీవితం!
దైవభక్తి, పాప భీతి, స్వర్గాశ,
అన్నీ ఈ మూడింటికీ లోబడినవే!
ధ్యానమూ, ప్రార్థనా కూడా అందుకే!

నిష్ఠూరమైనా నిజం చెప్పేవాణ్ని నేను!
మానవుడెంత దురదృష్టవంతుడు!
కోరిక తీర్చుకోవడం తప్ప
మరొక విలువేదీ ఎరగని వాడు!

కోరిక తీర్చుకోవడం కోసం
ఎన్ని ప్రయత్నాలైనా చేస్తాడు
ఎన్ని అబద్ధాలైనా ఆడతాడు,

ఎన్ని అకృత్యాలకైనా పాల్పడతాడు !
అనుకూల పరిస్థితులలో అందరూ మంచి వాళ్ళే !
పరిస్థితుల్ని అనుకూల పరచుకోవడం కోసం
ఎలాంటి నేరాల నైనా చేయగల వాళ్ళే !

అందుకే అన్నాను-
మంచి చెడ్డల గురించి ఆలోచించ వద్దని !
నీవు కళా మూర్తివి,
మానవుల కుండే భ్రాంతులు నీకు లేవు !

## 56. మూర్ఖత

పరమాత్మలోని మూడు గుణాల లోను
సత్వ గుణం శిలలు వంటి అచేతనాలది.
రజో గుణం మానవేతర జీవరాశు లన్నిటిదీ.
తమో గుణం కేవలం మానవులది.

మానవులెంత తామసు లంటే
మూడు గుణాలూ తమవే ననుకొనే మూర్ఖులు !
బొమ్మలుగా చెక్కి రాళ్ళను పూజిస్తారు.
స్థావర జంగమాదులను తిండికై వేటాడుతారు.
మూఢ విశ్వాసాలను సృష్టించి
సృష్టికి అవే కారణం అంటూ ప్రచారం చేసి
తమను తామే మోసగించుకొనేటంత మూర్ఖులు !

ఈ తామసానికి రాజసం తోడయితే
వీళ్లే రాజులూ, చక్రవర్తులూ,
ప్రబోధకులూ, ప్రవక్తలూ !
ఆకలి తీరక

సృష్టినే మింగేస్తున్న ఆశపోతులు
అంతక రూపులు వీళ్లే!

నీకు తెలియనిది కాదు,
చెప్పడం నా అలవాటు!

## 57. లక్ష్మీపతులూ - పృథ్వీపతులూ

మనసూ, మెదడూ వికసించిన మానవుడు
తదితర జీవరాశుల కంటే హీనంగా
బ్రతుకుతున్న ఈనాడు
జీవితానికి అర్థం రాజకీయం!
అభ్యుదయానికి అర్థం వ్యాపారం!
వ్యాపార రాజకీయాలు తప్ప
మానవ జీవితంలో మరింకేమున్నది?

లక్ష్మిని చంచలంగా చేసి
బలవంతులంతా లక్ష్మీ పతులయ్యారు
పృథివిని మూగదానిని చేసి
లక్ష్మీ పతులంతా పృథ్వీ పతు లయ్యారు.
లక్ష్మీ పతులూ, పృథ్వీపతులూ కలిసి
ధన స్వామిక భూస్వామిక కూటాలను ఏర్పర్చుకొని
తామే విష్ణుస్వరూపుల మన్నారు
నా విష్ణుః పృథివీ పతిః అన్న సిద్ధాంతం
అలా పుట్టిందే!

సంగీత సాహిత్యాలు, నృత్య శిల్ప కళాదులు అన్నీ
ఈ శ్రీపతుల, పృథ్వీ పతుల వినోదం కోసం,
కాలక్షేపం కోసం!

# 58. ప్రజా పాలన

రాజు, నియంత, ప్రజా నాయకుడు
ప్రజా పాలకు లెవరైనా గాని
ప్రజలకు శత్రువులైపోతూ వుంటారు
అధిక సంఖ్యాక ప్రజల కోరికలు
గొంతెమ్మ కోరికలుగానే వుంటూ వుంటై.

కరవ మంటే కప్పకు కోపం
విడవ మంటే పాముకు కోపం!
రెంటినీ సంతోష పరచడం ఎలా సాధ్యం?
పరిపాలకుల కుండే ఇబ్బంది అది!
కాగా, పాలకుల పట్ల మదంతో
క్రోధంతో మాత్సర్యం పెంచుకోవడం
పగ తీర్చుకోదలచడం న్యాయమేనా?
అన్యాయమూ, అధర్మమూ కాదా?
రాముడు కామ మోహాల నెరుగని మూర్ఖుడు!
దుర్యోధనుడు అరసికుడైన అజ్ఞాని!
వాళ్లవి రాజకీయాలు కాక పోయినా
ఉద్రేకాలను అధీనంలో
వుంచుకోలేక పోయిన చరిత్రలు అవి!

మానవుడు విస్తరించే కొలది
కుక్క బుద్ధి పెరిగింది!
ఆత్మ రక్షకులే తోకలుగా తయారై
తోకలే కుక్క నాడిస్తున్నై!

ఈ వాస్తవా లన్నీ
నీకు తెలుసు, నాకూ తెలుసు!
చూస్తూ మౌనం వహించడం తప్ప

నీవూ ఏమీ చేయలేవు,
నేనూ ఏమీ చేయలేను!

రాజరికంలో పనికిరాని మద మాత్సర్యాలు
ప్రజాస్వామికంలో పనికి వస్తాయా, కోకిలా?
మానవ లోక గమనం
ముందుకా, వెడలకా?

## 59. తిరిగి పట్టాలపైకి

పట్టాలు తప్పిన ఈ మానవ శకటాన్ని
తిరిగి పట్టాల మీద పెట్టడం
సాధ్యం కాదా, కోకిలా?
రాజ్యపాలన రౌడీలకు వదలి
కళాక్షేత్రంలో కాలం గడిపే మేధావులు
ఏమీ చెయ్యలేరు, నిజమే!
వాళ్ళ చేతికి తుపాకి ఇచ్చి
బైట రోడ్డు మీద నిలబెడితే
ఎలా వుంటుందంటావు?

తుపాకుల్ని రౌడీలు లాక్కొని
మేధావుల్ని కాల్చి చంపేస్తా రంటావా!
ఆబాల గోపాలం సమస్త ప్రజలకూ
సైనిక శిక్షణ నిర్బంధం
చెయ్యమన్నా నందుకే!
''చేతగాని మగవాడవు
స్త్రీ జోలికి పోనేలా'' అన్నాను
'మానవుని మరొక మజిలీ' కావ్యంలో!

చేతగాని తనం వుండ కూడదు,
చేతగాని తనాన్ని నిషేధించాలి!
శిక్షించి సంస్కరించ లేకపోతే
ముళ్ళ డొంకలను వలే నిర్మూలించి
ముందుకు దారి సుగమం చెయ్యాలి!
ఇది నా నినాదం
నీ గాన స్రవంతికి నిదానం!

## ౬౦. వర్ణ సమ్మేళనం

ఇంద్ర ధనస్సులో ఏడు రంగులు
సంగీతంలో సప్త స్వరాలు
ఓషధులలో షడ్రుచులు
రాళ్ళలో నవ రత్నాలు
చంద్ర బింబంలో షోడశ కళలు -
ఇలా ఎన్నైనా చెప్పవచ్చు.
సృష్టిలోని సమస్త గుణాలూ
ప్రకృతి నిండా కనిపిస్తే
అన్నీ ప్రకృతి సిద్ధాలే!
ప్రకృతికి ప్రియమైనవే!
పైకి కనిపించే వైరుధ్యాలు కూడా
ఆత్మీయ మైనవే, అన్యోన్యత కలవే!

ఈ సత్యం నీకూ, నాకూ తెలుసు
తదితర జీవ కోటి కంతకూ తెలుసు!
మరి, కోకిలా,
మనుషుల కెందుకీ వర్ణ భేదాలు?
వర్ణానికీ, వర్ణానికీ నడుమ
ఎందుకీ ఉద్రిక్తతలు?

కర్రలతో కొట్టుకోడాలు,
కత్తులతో నరుక్కోడాలు ?
మానవుడిలోకి ఈ అధమత్వం
ఎలా వచ్చిందంటావు ?

## 61. మానవత్వం

మానవత్వం అంటే హ్యూమనిజం !
ఇతర జీవరాశులకువలెనే
మానవ జీవికి కూడా
ఒక విశిష్ట జీవ లక్షణం వున్నదనుకొని
మానవత్వం అన్నాను.
నిజంగా మానవుడి కొక విశిష్ట లక్షణం వున్నదా ?
లేదనే నా ఉద్దేశం !

గోవు గడ్డి తింటుంది
వ్యాఘ్రం మాంసం తింటుంది
ఈ రెండూ తినే గోముఖ వ్యాఘ్రం
మానవు డొక్కడే అన్నానందుకే !

ప్రకృతి ధర్మాన్ని అనుసరించని వాడు
ఒక విశిష్ట నైజం లేనివాడు
ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో తనకే తెలియని వాడు
మొత్తం సృష్టికే ప్రమాదకారిగా పరిణమించినవాడు
మానవ జీవి ఒక్కడే !
ప్రకృతి సూక్ష్మాలను గ్రహించే
శక్తి గల మెదడుంది.
నడవడానికి రెండు కాళ్లు సరిపోగా
రెండు చేతులు స్వేచ్ఛగా పని చేస్తై.
ఈ ప్రత్యేక శక్తుల ద్వారా
ప్రపంచానికే ప్రమాదకారిగా

పరిణమించ గలిగాడు మానవుడు !
స్వార్థం, ధనార్జన, వ్యాపారం, లోభ మద మాత్సర్యాలు
అధికంగా పెంచుకొని
ప్రకృతిపై ఆధిపత్యం వహించిన మానవుడ్ని
ఉత్తమ జీవిగా నేను స్వీకరించలేను.

అందుకే...
మానవత్వం అనేది
ప్రత్యేకంగా ఏమీ లేదంటున్నాను !
ప్రత్యేకత వుంటే
అది సర్వ నాశక గుణం మాత్రమే !
ప్రేమిస్తాడు, చంపుతాడు, దొంగిలిస్తాడు
పెంచుతాడు, త్రుంచుతాడు
అవసరానికి మించి నిలవ చేసుకొంటాడు
నిలవల రక్షణ కోసం యుద్ధాలు చేస్తాడు
అన్నీ మానవ గుణాలే, మానవ లక్షణాలే !

ఏవో దైవీయ గుణాలను ఊహించి
వాటిని మానవత్వం అనడం
పామరుల వీర పూజా తత్వం మాత్రమే !

## ఉన్నవోదయ కోకిల

కోకిలా....
నీతోపాటు కాల జ్ఞానం గల జీవి
మరొకటుంది కదూ !
అది కోడి పుంజు !
బ్రహ్మ ముహూర్తంలో లేచి
లోకాన్ని మేలు కొలిపే కాల జ్ఞాని !
పల్లె పల్లెకూ, పట్టణ జనానికీ కూడా
అది తోడు నీడగా వుండేది !

మన స్వతంత్ర భారత వృద్ధ ప్రభువులు
కోడి పందాలను నిషేధించి
కోడి పుంజులను అంతం చేశారు!
విదేశీ దొరల మీది కోపంతో
స్వదేశీ గణ తంత్రాలను నిషేధించి
ఎంత ప్రగతిని సాధించారో తెలుసు కదా!
అక్కరలే దనుకొన్న విషయాన్ని నిషేధిస్తే
అది విశుద్ధ స్థానానికే ముప్పు తెస్తుందన్న జ్ఞానం
మన నూతన ప్రభువులకు లేక పోయింది!
ఇప్పటికీ అదే అజ్ఞానం!
ఏం చేస్తాం?
కోడి పందాలు పోతే
కొట్లాటలు ఆగాయా?
కాల జ్ఞానంలోని ఒక విశిష్ట ప్రకృతి
నశించి పోయిందంతే!

## ౬౩. ఘర్షణే ప్రగతి

ఘర్షణ సహజ సిద్ధమే, కానీ
అది అభివృద్ధి నిరోధకం కాగూడదు!

వేదన ఘర్షణ ఫలితమే!
వేదనకు ప్రసవ వేదనే ఉదాహరణ!

మరణవేదనగా కనిపించేది
మరొక స్థితికి ప్రసవ వేదనే!
వేదన అభివృద్ధికరం, అభ్యుదయకరం, ఆనందకరం!
ఆనందో బ్రహ్మ అన్నారు ఋషులు!

పరబ్రహ్మంలోని రెండు శక్తుల ఘర్షణే సృష్టి
అది నిరంతరం, నిర్విరామం, నిత్యానందకరం!

అందులో నీ సభ్యత్వం స్థిరం,
నా ప్రాతినిధ్యం శాశ్వతం!

## 64. లక్ష అపస్వరాల భరించి

కోకిలా!
అనాదివీ నీవే, అనంతత్వమూ నీవే!
లక్ష అపస్వరాలను భరించి
ఒక్క పాటైనా పాడుకొందాం
అని నేను వ్రాసింది
నీ పాట వింటూనే!
పూవుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో!
అందుకని -
ముళ్ల తోట అననా దీన్ని?
అని వ్రాశాను.

కోకిలలు నాలుగే,
తక్కిన పిట్టలు అసంఖ్యాకం
ఈ నా మధు వనంలో!
అందుకని -
పెరికి పారవేయనా దీన్ని?
అని కూడా అన్నాను అక్కడే!

మనం మంచి అనుకునే దాని కంటే
చెడు అనుకునేదే అత్యధికం సృష్టిలో!
అందుకని -
సృష్టినే నిరాకరించగలమా?

# 65. జాతీయ సోషలిజం

కులం ఒక జాతిగా, మతం ఒక వర్గంగా
నిత్య పోరాటాలతో అంతరించిపోతున్న జాతిని
సమైక్య పరచి ఏకీకృతం చెయ్యాలని
పట్టణీకరణను ప్రతిపాదించాను.

కత్తి సాముతో కదం తొక్కుతున్న వారి నుంచి
సామాన్యులను రక్షించడం కోసం
నిర్బంధ సైనిక శిక్షణ ప్రతిపాదించాను.

సంస్కృతుల ప్రాతిపదికపై
జాతులను జాగృతం చేసి
జాతి కొక దేశంగా
లోకాన్ని పునర్మించడం కోసం
జాతీయ సోషలిస్టు పద్ధతి ప్రతిపాదించాను.
మేధావులు సాయుధులై
వీధి రౌడీయిజాన్ని నిర్మూలించాలన్నాను.
జ్ఞాన విజ్ఞానాలూ, ప్రతిభా ప్రాభవాలూ
అట్టి సోషలిజాన్ని నిఖిల దేశాలలోనూ
నిర్వహించా లన్నాను.

రాజకీయ పార్టీ లుండ కూడ దన్నాను.
నిరసనలకు, నినాదాలకూ
సమ్మెలకూ, ధర్నాలకూ తావుండ కూడదన్నాను.

నా ప్రతి పాదనలు స్వార్థపరులకు కిట్టవు
స్వప్రయోజకులకు పనికి రావు!
పదవీ ప్రాభవాలన్నీ తమ చేతుల్లోనే కల
ప్రజా నాయకు లెవరికీ
నా ప్రవచనాలు రుచించవు.

ప్రచార సాధనాధిపతులు పట్టించుకోరు!
అందుకే నాది ఒంటరిగొంతు అయింది!

## 66. నాది నీ రాజకీయం

నేను ప్రవక్తను కాదు,
ప్రవచనాలు పలుకుతున్న కవిని!
నాది గతాన్ని సొమ్ము చేసుకునే వ్యాపారం కాదు,
వర్తమానాన్ని భవిష్యత్తుకు మలుస్తున్న కర్షకుడ్ని!
వర్తమానం ఎంతగా గతుకుల రోడ్డులా వున్నదో చూపుతూ,
ఎంత ప్రవక్తల అపోహలతో, రాగద్వేషాలతో, స్వార్థ రాజకీయాలతో
కుతకుత లాడిపోతున్నదో దర్శింప చేస్తూ,
మానవుని మరొక మజిలీకి మార్గం వేస్తున్న ధార్మికుడ్ని!
దారిబత్తెం సమకూరుస్తున్న మధుపాయిని!
సుఖ సంతోషాలు సూత్రీకరిస్తున్న
యాత్రా స్పెషలిస్టును!

నాది రాజకీయం కాదు,
ప్రజా జీవన సరళి!
వ్యాపారం కాదు,
విశ్వ జనాస్వాద్య సుధా కలశం!

## 67. జీవిత నాట్యం

కోకిలా!
నాది ఒంటరి గొంతు కాదు,
నీదీ ఒంటరి గొంతు కాదు!
నీవు ఉన్నవోదయ ప్రవక్తవు,
నేను ఉన్నవోదయ ప్రవర్తకుడ్ని!
నీది ప్రకృతి విజ్ఞానం,
నాది మానవాభ్యుదయం!
మనిద్దరం కలిసిందే జీవితం,
మనిద్దరం కలిసి పాడిందే వికాసం,

మన బృందగానమే సుందర బృందావనం!

కోకిలా ....

నీవు చిలకలా పలకగలవా
గీతా శ్లోకాలూ, ఉపనిషత్ సూక్తులూ?
గోరింకలా గోకుల కృష్ణుని
నామజపం చేయగలవా?

ఒక లక్ష్యం లేని ఆత్మలకు
ఎటు పోతే అదే మార్గం!
ఏది ఆకర్షిస్తే అదే లక్ష్యం!

నీవలా కాదు!
నీ ప్రతిభ నైసర్గికం,
నీ లక్ష్యం స్వభావ సిద్ధం!
నీ సందేశం ఒక్కటే,
లేవండి, ఉన్నతులు కండి అని!
లేచి పురోగమించడమే జీవితం!

## 68. రాధా తత్త్వం

నీవు మధు ప్రియవు,
మాధవ మిత్రవు!
లోక మిత్రుడ్నే నిరంతరం
నీ వెంట తిప్పుకునే ఉషస్సువు, రాధవు!

లోక మిత్రుడే నీ వెంటపడి పరిగెత్తుతుంటే
తత్కుటుంబంలోని మేమంతా
అతని వెంటబడి నీ చుట్టూ తిరుగుతున్నాం!
నీవు రాధవు!
భువనా లన్నీ నీ విహార విపినాలు!

భౌతిక రూపం కరిగి పోగా
నా మనస్సు నీ అడుగు జాడలలో విహరిస్తూ
నీవే అయిపోతున్నది !

అన్ని వేదాలకూ
రాధా వేదమే బీజం !
జీవ కోటి కంతకూ
రాధా నామాణువే జన్యువు !
అట్టి నీవు నా కిప్పుడు కావ్య నాయికవు !
నీది పంచమ స్వరం,
నాది తత్ స్వర సమ్మేళన సమాను లేఖిని !

## 69. పురా విశ్వాసం

కోకిలా...
నీ వేదో చెపుతున్నావు
నే నేదో వింటున్నాను
నీ వేమి చెపుతున్నావో,
నే నేమి వింటున్నానో !
అంతా భ్రాంతి !

ప్రజలు నమ్మేది భ్రాంతినే !
వాళ్లకు తెలియదు కనుక నమ్మేస్తారు
నమ్మకం మీదే నడుస్తున్నది లోకం !

నీవు విశ్వ ప్రవక్తవు !
ఏమైనా చెప్పగలవు !
నీవు చెప్పేదంతా వాస్తవం, సత్యం, ధర్మం !
ప్రకృతి నైజమే ధర్మం
అందుకే నీవు ధర్మ ప్రవక్తవు !

నీ ధర్మాన్ని అర్థం చేసుకొని
ప్రజలకు వినిపించే నేనూ ప్రవక్తనే!
నాపై విశ్వాసం గల ప్రజలే
నిజమైన మానవులు!
అందుకే విశ్వాసం పరమ ధర్మం అయింది!

## 70. రంగులు

అన్ని రంగులూ అందమైనవే
అన్ని రాళ్లూ ప్రశస్తమైనవే
అన్ని జీవులూ ప్రయోజనకర మైనట్టివే
అందరు మానవులూ వ్యక్తిత్వం కలవాళ్ళే!

మరి, తేడా లెక్కడుంటై?
మన దృక్కోణాలను బట్టి వుంటై!
తెల్లని కాకిరెట్ట అసహ్యాకరం,
నల్లని కృష్ణుడు జగన్మోహనుడు!
పసుపు పచ్చన మనిషిలో ప్రమాదకరం!

అందాలూ, ఆనందాలూ, అనురాగాలూ
పరస్పర ప్రయోజనాలను బట్టి వుంటై,
ఆకర్షణలను బట్టి అలరిస్తై!

ప్రకృతిలో స్వచ్ఛత సాపేక్షకం,
సమదృష్టి సర్వేశ్వరం!

## 71. ఉన్నవోదయ ధర్మం

ఉన్నవోదయ ధర్మాన్ని
మానవుని మరొక మజిలీ అన్నాను కదూ!
మానవుడు మరొక మజిలీకి చేరాలంటే

ఏం చెయ్యాలి ?

నీవు చెపుతూనే వున్నావు,
ప్రవక్తలు వింటూనే వున్నారు !
అయితే...
తలో క విధంగానూ
ప్రజలకు చెపుతున్నారు !
వారు చెప్పింది వారి అనుచరులు వింటున్నారు,
అదే ధర్మమని విశ్వసిస్తున్నారు !

నేను ప్రవక్తను కాను కనుక
నా మార్గంలో నేను చెప్పాను,
ఇప్పుడు చెపుతున్నాను !
వినే వాళ్ళు పుణ్యాత్ములు,
విశ్వసించే వాళ్లు ధర్మాత్ములు !

## 72. నవోషః కిరణాలు

ఇంతకూ.....
నీవు చెపుతున్నదీ
నేను వివరిస్తున్నదీ ఏమిటి ?
సర్వ మానవ సమతా ధర్మం !
జాతీయతను ప్రాతిపదికగా తీసుకొని
దేశాలు ఏర్పడాలి !
ఎన్ని జాతీయతలు వుంటే
లోకం అన్ని దేశాలుగా
విభజింప బడాలి !
ప్రతి దేశమూ తన జాతీయత ప్రకారం
సర్వ మానవ సమతను
ప్రభుత్వ ధర్మంగా స్వీకరించాలి !
దానినే జాతీయ సోషలిజం అంటున్నాను.

అన్ని దేశాలూ చిన్నవైనా, పెద్దవైనా
జాతీయ సోషలిస్టు దేశాలుగానే వుంటై!
ఎవరి జాతీయతను వారు అనుసరిస్తూ
అభివృద్ధి పొందుతారు
పురోగమిస్తారు, ప్రగతిని సాధిస్తారు!
అన్ని దేశాల సమాఖ్య
ప్రపంచ ప్రభుత్వం అవుతుంది!

ఇందుకు అనుసరించవలసిన ప్రణాళిక...
పట్టణీకరణా, నిర్బంధ సైనిక శిక్షణా,
సహకార వ్యవసాయమూ, పరిశ్రమలూ,
ప్రజలంతా కలసి ఎన్నుకొనే అధ్యక్షుని పాలనా,
రెండే పార్టీల పద్ధతీ,
కుల మత చిహ్నాలు తొలగించుకొని
మానవుడు మానవుడిగా వికసించడం,
అన్ని రంగాలలోనూ స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం,
మరణ శిక్ష రద్దూ, జైళ్లను వ్యవసాయ
పారిశ్రామిక క్షేత్రాలుగా మార్చడం....

ఇలాంటి ఎన్నో పథకాలు
నా పంచమ స్వర కావ్యంలో వున్నై.
అవి నీ స్వరాలే కదా!

## 73. ధర్మ వీరం

"నన్నెవ్వరాపలేరీవేళ
నా ధాటి కోర్వలేరీవేళ"
అన్నాడు బసవరాజనుకొంటాను!
అదీ నిజమైన కవి అనవలసిన మాట!

కవుల మాటలు నీటి మూటలుగానే
నిమ్న గాము లైపోతున్నై!
అవి కార్య రూపం ధరించి
హింసా రాజకీయాల పట్ల
తూటాలు కావలసి వుంది!
వేములవాడ భీమకవి మాటలు తూటాలై
రాజరికాలనే మార్చినై కాదా!

బలవంతుడు రాజు
బలహీనుడు బానిస,
బానిసగా బతక లేవా!
బలం సంపాదించుకో
అన్నా నొక చోట!

ప్రపంచ శాంతికి మార్గం
ఒక పౌరుష జీవిత మేనోయ్
కత్తికి కత్తి, కర్రకు కర్ర
కలిపిన నాడే సంధి కుదురునోయ్
అంటూ ఉద్బోధించాను!

చేత విల్లు కలవాడే
గీత నందుకోగలడు
అంటూ నిదర్శనం చూపాను!

ఇలా శతాధికంగా ప్రవచనాలు పలికాను,
సహస్రాధికంగా నినాదాలు చేశాను!

నేను సాహిత్య వ్యవసాయకుడ్ని!
నా కృషి సమస్తమూ
ప్రజాభ్యుదయాన్ని పండించి
రాశులుగా పొయ్యడమే!

నీవు నా సహచరివి, సహకారిణివి,
నా సరస్వతివి!
నీది ఒంటరి గొంతు కాదు,
నాదీ ఒంటరి గొంతు కాదు!

## 74. మేధా నైరంతర్యం

బ్రహ్మ, పరబ్రహ్మ, పరమాత్మ, శక్తి
ఈ మాట లన్నింటికీ ఒకటే అర్థం....
సృష్టికి కారణమై నడిపిస్తున్న
జీవశక్తి అని!

జీవశక్తికి భౌతిక రూపమే మెదడు, మేధ!
సృష్టి సమస్తమూ
చరాచర స్థావర జంగమాదు లన్నీ
మేధామయ ప్రకృతి రూపాలే!
జీవ రాశుల శరీరాలు మొత్తం
మేధాణు సంచితాలే కదా!
మానవ శరీరం మొత్తం మేధాణు ధారా శిల్పం!

పరమాత్మ నుంచి ఆత్మగా
ఆత్మ నుంచి తిరిగి పరమాత్మగా
యాతాయాత నిత్య నిరంతర ప్రవాహమే
నిత్య జీవిత ప్రవర్తనం!
ఈ పరమ ప్రవాహంలో
వివిధ రూపాల, ప్రమాణాల అలలం మనం!
నీవు కూస్తూనే వుంటావు,
నేను వ్రాస్తూనే వుంటాను!
పరమాత్మలోకి నిరంతరంగా
పోతూ వస్తూ వుంటాం
మేధావులం, మేధా మయులం
కళారూపాలం, కళ్యాణ కింకిణులం!

## 75. నా పీఠికలు

నా కవితలు పూల చెట్లైతే
నా పీఠికలు పూల కుండీలు,
నీళ్ల పాదులు, రాళ్ల గుట్టలు !

నా పద్యాలు దీప జ్యోతులైతే
నా కావ్యాలు దీప సభలు !

నా కావ్యాలు ఫల వృక్షాలైతే
అవి రాధాకృష్ణుల విహార వనాలు,
సీతా రాముల దండ కారణ్యాలు,

కోకిలా...
నా ప్రతి రచనకూ ఒక ప్రోత్సాహకం,
ఒక రసావేశ గుళిక,
ఒక ప్రేమశక్తి వుంటుందంటే
అది శతాధిక రూపాంతరాలలో ప్రకృతే,
ఏకైక రూపంలో అది నీవే !

నీవు దీపాని వైతే
నా పీఠికలు ప్రమిదలు !
నీవు రవి బింబాని వైతే
అవి సుప్రభాత భేరీలు !

## 76. కృతజ్ఞతా నమస్సులు

నా పీఠికలు పూలకుండీ లన్నాను కదూ !
అందులో నా రచనలు పూల చెట్లైతే
వాటి లతాంతాల ఉషస్సులు
నా కృతజ్ఞతాభి నమస్సులు !

నా ప్రతి రచన వెనుకా

ఒక ప్రోత్సాహక ప్రియశక్తి వున్నట్టే,
నా ప్రతి రచన ముద్రణ వెనుకా
అనేక ప్రోత్సాహక వదాన్య శక్తులుంటై!
అందులో ముఖ్యమైన కొందరికైనా
కృతజ్ఞతలు చెపుతూ వుండడం నా అలవాటు!

ఈ కావ్యానికి ప్రోత్సాహక ప్రియవైన నీకు
ముందుగా కృతజ్ఞతలు చెపుతున్నాను!

తరువాత...

కావ్య నిర్మాణ భావాంకురానికి హేతువు
ఢిల్లీలో పద్మభూషణ్ అందుకొని
ఆ ముందు రోజే ఇల్లు చేరిన ఉత్సాహం!
పద్మభూషణ్ రావడానికి
మేం ఢిల్లీ వెళ్లడానికి మూల హేతువులైన
రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి,
సాహితీ బావగారు కాకి మాధవరావు గారికి,
కృతజ్ఞత లెన్ని చెప్పినా చాలవు!

నా కూడా ఢిల్లీ వచ్చిన ఎస్కార్టులు
మా ఆవిడ హైమవతికీ
మా అమ్మాయి విజయ పల్లవికీ
మమ్ము విమాన మెక్కించిన
మా మరో అమ్మాయి విజయేందిరకూ
ఢిల్లీలో తిరిగి విమాన మెక్కించిన
ఐ. ఏ. ఎస్. అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా గారికీ
కృతజ్ఞతలు చెప్పకపోతే ఎలా?

నేను చెపుతూ వుంటే

లేఖకురాలుగా వ్రాస్తూ
ఈ కావ్యానికి ఈ రూపం తెచ్చిన
విజయేందిర ( విజ్జు) కూ,
ముద్రించి సిద్ధపరచడానికి తోడ్పడిన
ఖండాంతర విద్యా దర్శకా చార్యులు
ఆంధ్ర విశ్వ విద్యాలయ ఫిజిక్సు ప్రొఫెసర్
ఆచార్య రత్నరాజు గారికి
కృతజ్ఞతా రసాంజలి నివేదించుకోవలసి వుంది !

విద్యార్థి దశ నుంచీ పరిచయస్తులుగా
మిత్రులుగా, ఆత్మీయులుగా
సాహితీ పోషకులుగా
నాకు చేదోడు వాదోడై వికసించిన
జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య గారికి,
సాహితీ భూషణి వాసిరెడ్డి సీతాదేవి గారికి
కృతజ్ఞతలు ఎప్పుడూ చెపుతున్నవే !

ఇంకా...
రకరకాలుగా సహాయ పడుతూ వస్తున్న
అడ్వకేటు గొల్లపల్లి రమేష్ బాబు,
డాక్టరు రమేష్ చంద్ర,
ఆర్టిస్టూ, కంప్యూటరిస్టూ అయిన
పొన్నాడ రవిచంద్ర,
టీవీ కళాకారిణి పంపన సుమిత్ర
మున్నగు యువతీ యువకు లెంతో మందికి
నా అక్షరాశీస్సులు !
పైగా....

నాకు ప్రియ సచివుడైన
పొన్నాడ రవిచంద్ర
నా సాహితీ దర్బారులో
ఆస్థాన చిత్రకారుడు
ముఖ పత్ర రచనా ధురీణుడు
ముద్రణ కళలో క్షణక్షణం వికసిస్తున్న చతురుడు !

కోకిలా ...
ఇది వృష నామ సంవత్సరంలో
నీ తొలి గాన సందేశానికి
పీఠికా ముక్తాయింపు !
నా తొంభై ఒకటవ జన్మోత్సవ సందర్భ మిది !
జన్మ తేదీ పంథొమ్మిదిని తిరగవేస్తే
తొంభై ఒకటి అవుతుంది కదా !
నీ కోసం ఇదొక సాహితీ చమత్కార పురస్కారం !